

రోడ్డు ప్రమాదంలో ఇద్దరి మృతి

» ద్విచక్ర వాహనాన్ని వెనుక నుంచి ఢీకొన్న లారీ

... మెయిన్ 14లో



సంఘటనా స్థలంలో మృతదేహాలు



సుబ్రహ్మణ్యం (ఫైల్)



మజ్జి మంగమ్మ (ఫైల్)

తల్లుల్లో ఆనందోత్సవాలు

బ్యాంకు ఖాతాల్లోకి 'తల్లికి వందనం' డబ్బులు జమ

- కుటుంబంలో చదువుకునే పిల్లలందరికీ పథకం వర్తింపు
- ముగ్గురు పిల్లలుంటే రూ.39 వేలు, నలుగురుంటే రూ.52 వేలు, ఐదుగురైతే రూ.65 వేలు..
- ఖాతాల్లో డబ్బులు పడినట్టు మెసేజ్‌లు రావడంతో ఉబ్బితబ్బిబ్బు
- మిగిలిన రూ.2 వేలు పాఠశాలల నిర్వహణకు కలెక్టర్ ఖాతాలో జమ
- జాబితాల్లో పేర్లు లేని అర్హులకు మరోసారి అవకాశం

(అనకాపల్లి-ఆంధ్రజ్యోతి)

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తున్న 'తల్లికి వందనం' పథకం డబ్బులు గురువారం సాయంత్రం నుంచే తల్లుల బ్యాంకు ఖాతాల్లో జమ అవుతున్నాయి. రెండో తరగతి నుంచి పదో తరగతి వరకు, ఇంటర్ రెండో ఏడాది చదువుతున్న పిల్లలు ఎంత మంది వుంటే అంత మందికీ నగదు జమ అవుతున్నది. దీంతో తల్లిదండ్రులు సంతోషాన్ని వ్యక్తం చేస్తున్నారు.

నిరుపేద కుటుంబాల్లో పిల్లల చదువను ప్రోత్సహించే లక్ష్యంతో ప్రతి బిడ్డకు ఏటా రూ.15 వేల చొప్పున సాయం అందిస్తామని గత ఎన్నికల ముందు కూటమి నేతలు ప్రకటించడమే కాకుండా 'సూపర్ సిక్స్'లో చేర్చిన విషయం తెలిసిందే. ఇచ్చిన హామీని ప్రస్తుత విద్యా సంవత్సరం నుంచి అమలు చేయనున్నట్టు ప్రభుత్వం గతంలోనే వెల్లడించింది. ఈ పథకం పేరును 'తల్లికి వందనం' అని ప్రకటించింది. గురువారం పాఠశాలలు పునఃప్రారంభం కావడంతో రెండో తరగతి నుంచి పదో తరగతి వరకు, ఇంటర్ రెండో సంవత్సరం చదువుతున్న విద్యార్థుల్లో ఈ పథకానికి అర్హులైన వారి జాబితాలను సచివాలయాల్లో ప్రదర్శించారు. ఇదే రోజున ప్రభుత్వం నిధులు విడుదల చేసింది. జిల్లాలో 1,78,272 మంది విద్యార్థులకు సంబంధించి 1,19,357 మంది తల్లుల బ్యాంకు ఖాతాల్లో రూ.213,75,36,000 జమ కానున్నది. గురువారం సాయంత్రం నుంచే తల్లుల బ్యాంకు ఖాతాల్లో డబ్బులు జమ కావడం మొదలైంది. ఒక్కో విద్యార్థికి రూ.15 వేల చొప్పున నిధులు విడుదల చేయగా, వీటిలో రూ.13 వేలు తల్లుల బ్యాంకు ఖాతాల్లో

... మిగతా 8వ పేజీలో



నలుగురు పిల్లలతో కూరాకుల గిరిబాబు, రాజేశ్వరి దంపతులు

ఒకే కుటుంబంలో నలుగురికి...

- చంద్రబాబుకు రుణపడి ఉంటాం
- కూరాకుల రాజేశ్వరి, ఎరకంపేట, గొలుగొండ మండలం

గొలుగొండ, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): గొలుగొండ మండలం చీడిగుమ్మల పంచాయతీ శివారు ఎరకంపేటకు చెందిన కూరాకుల గిరిబాబు, రాజేశ్వరి దంపతులకు నలుగురు పిల్లలు. పెద్ద కుమార్తె పవిత్ర చీడిగుమ్మల హైస్కూల్లో 9వ తరగతి, రెండో కుమార్తె వేములపూడి కేజీబీవీలో ఎనిమిదో తరగతి, మూడో కుమార్తె, చివరి సంతానం కుమారుడు ఎరకంపేట ప్రభుత్వ పాఠశాలలో ఐదు, నాలుగు తరగతులు చదువుతన్నారు. నలుగురికీ సంబంధించి తల్లికి వందనం పథకం కింద రాజేశ్వరి బ్యాంకు ఖాతాలో రూ.52 వేల రూపాయలు జమ అయ్యాయి. ఈ సందర్భంగా రాజేశ్వరి మాట్లాడుతూ తమ కుటుంబాన్ని అన్నివిధాలా ఆదుకున్నందుకు ముఖ్యమంత్రి చంద్ర బాబు నాయుడుకు రుణపడి ఉంటామని పేర్కొంది.

ఒకే కుటుంబంలో ఐదుగురికి..

- ఆనందం వ్యక్తం చేసిన పేద కుటుంబం

పాయకరావుపేట/రూరల్, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): పాయకరావుపేట మండలం గోపాలపట్నం శివారు పెద్దిపాలెం గ్రామానికి చెందిన వ్యవసాయ కూలీలైన మురుకుర్తి కోటేశ్వర రావు, అమ్మాజీ దంపతులకు ఐదుగురు సంతానం. ప్రస్తుతం వీరందరూ ప్రస్తుతం వేర్వేరు తరగతుల్లో వున్నారు. 'తల్లికి వందనం' పథకం కింద ఐదుగురికీ డబ్బులు మంజూరు కానున్నట్టు తెలియడంతో సంతోషం వ్యక్తం చేస్తున్నారు. పెద్ద కుమార్తె జోగేశ్వరి పదో తరగతి పూర్తిచేసి ఇంటర్ ఫస్టియర్‌లో చేరింది. తరువాత ఇద్దరు కవల పిల్లలు రాంబాబు, లచ్చబాబు మంగవరం జడ్పీ ఉన్నత పాఠశాలలో 8వ తరగతి చదువుతున్నారు. మిగిలిన ఇద్దరిలో భవ్యశ్రీ 3వ తరగతి, ధనుంజయ 2వ తరగతి పెద్దిపాలెంలోని ఎంపీపీ స్కూల్లో చదువుతున్నారు. వైసీపీ హయాంలో కుటుంబంలో ఒక్కరికి మాత్రమే అమ్మఒడి మసాయం అందగా, కూటమి ప్రభుత్వం పిల్లలందరికీ 'తల్లికి వందనం' సాయం అందజేస్తుండడం ఎంతో ఆనందంగా వుందని కోటేశ్వరావు, అమ్మాజీ చెప్పారు.



ఐదుగురు పిల్లలతో కోటేశ్వరరావు, అమ్మాజీ దంపతులు

ప్రభుత్వ శాఖల్లో బదిలీల సందడి!

పలువురు అధికారులకు స్థానచలనం

- పూర్తయిన హెచ్‌ఎంలు, ఎస్‌ఏల బదిలీలు
- ఎస్‌జీటీలకు కొనసాగుతున్న ప్రక్రియ
- సచివాలయాల ఉద్యోగుల బదిలీలకు మార్గదర్శకాలు



విశాఖలో కౌన్సెలింగ్‌కు హాజరైన ఎస్‌జీటీలు

అనకాపల్లి, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని వివిధ ప్రభుత్వ శాఖల్లో అధికారులు, సిబ్బంది బదిలీల ప్రక్రియ తుది దశకు చేరింది. బదిలీల కోసం దరఖాస్తు చేయడానికి తొమ్మిదో తేదీ సాయంత్రంతో గడువు ముగియగా, అదే రోజు రాత్రి నుంచి ఆన్‌లైన్‌లో బదిలీల కౌన్సెలింగ్ మొదలైంది. ఐదేళ్లపాటు ఒకే చోట విధులు నిర్వహిస్తున్న ఉద్యోగులు తప్పనిసరిగా బదిలీ కావాల్సి వుంటుంది. ఇప్పటికే రెవెన్యూ శాఖలో తహశీల్దార్లు, డిప్యూటీ తహశీల్దార్లు, సీనియర్ అసిస్టెంట్‌లలో పలువురికి స్థానచలనం కలిగింది. బదిలీ అయిన ఉద్యోగులు కొత్త స్థానంలో విధుల్లో చేరడం, అంతవరకు అక్కడ పని చేస్తున్న ఉద్యోగులు రిలీవ్ అవుతుండడంతో ప్రభుత్వ కార్యాలయాల్లో హడావిడి నెలకొంది. కాగా రెవెన్యూ, పంచాయతీరాజ్, విద్య, వైద్యం, గ్రామీణ నీటి సరఫరా, వ్యవసాయ, మునిసిపల్‌తోపాటు వివిధ ఇంజనీరింగ్ విభాగాల్లో ఉద్యోగుల బదిలీలు తుదిదశకు చేరాయి. ఉపాధ్యాయులకు సంబంధించి హెచ్‌ఎంలు, ఎస్‌ఏల బదిలీలు ఆన్‌లైన్‌లో ఇప్పటికే పూర్తయ్యాయి. జిల్లాలోని వివిధ ఉన్నత పాఠశాలల్లో పనిచేస్తున్న 98 మంది గ్రేడ్-2 ప్రధానోపాధ్యాయులకు స్థానచలనం కల్పించారు. వీరిలో 35 మందికిపైగా ప్రధానోపాధ్యాయులకు పదోన్నతులు కల్పిస్తూ బదిలీ చేశారు. జిల్లాలో వివిధ పాఠశాలల నుంచి 580 మంది స్కూల్ అసిస్టెంట్లకు స్థానచలనం కల్పించారు. ఎస్‌జీటీల బదిలీలు మాన్యువల్‌గా ఉమ్మడి జిల్లాను యూనిట్‌గా తీసుకుని మూడు రోజుల నుంచి విశాఖపట్నంలో నిర్వహిస్తున్న విషయం తెలిసిందే.

జిల్లా అధికారులు బదిలీ

జిల్లాలో వివిధ శాఖలకు చెందిన 11 మంది జిల్లాస్థాయి అధికారులు బదిలీ అయ్యారు. జిల్లా ఉద్యాన శాఖాధికారి ప్రభాకరరావు పశ్చిమగోదావరి జిల్లాకు బదిలీకాగా ఆయన స్థానంలో అల్లూరి సీతారామరాజు జిల్లా ఉంచి రహీం రానున్నారు. జిల్లా పంచాయతీ అధికారి శిరీషారాణి విజయనగరం జిల్లాకు బదిలీకాగా.. ఆమె స్థానంలో సందీప్ వస్తున్నారు. గిరిజన సంక్షేమ శాఖాధికారిగా మంగవాణి, స్త్రీ, శిశు సంక్షేమ శాఖ పీడీగా సూర్యలక్ష్మి బదిలీపై జిల్లాకు వస్తున్నారు.

గ్రామ/ వార్డు సచివాలయాల సిబ్బందికీ బదిలీలు


జిల్లాలో గ్రామ/ వార్డు సచివాలయాల సిబ్బంది బదిలీలకు సంబంధించి ప్రభుత్వం మార్గదర్శకాలను జారీ చేసింది. 2025 మే 31వ తేదీ నాటికి ఒకేచోట ఐదేళ్ల సర్వీసు పూర్తి చేసిన ఉద్యోగులు తప్పనిసరిగా బదిలీ కావాల్సిందే. జిల్లాలో 522 సచివాలయాల్లో 3,650 మంది ఉద్యోగులు పనిచేస్తున్నారు. బదిలీల కోసం జూలై 10వ తేదీలోగా హెచ్‌ఆర్‌ఎంఎస్ పోర్టల్‌లో దరఖాస్తులు అప్‌లోడ్ చేయాలని జిల్లా సచివాలయాల సమన్వయ అధికారి మంజులా వాణి ఇప్పటికే ఆదేశాలు జారీ

... మిగతా 8వ పేజీలో

ప్రభుత్వ భూమికి విముక్తి

- ఇప్పటికే రెవెన్యూ, అటవీ భూముల సరిహద్దులు గుర్తింపు
- సాగుదారుల జాబితాలను సిద్ధం చేసిన అధికారులు
- చిన్న, సన్నకారు రైతులకు తగిన పరిహారం చెల్లించే యోచన
- కేంద్ర ప్రభుత్వ రంగం సంస్థ బీడీఎల్‌తోపాటు పలు పరిశ్రమలకు భూములు కేటాయించే అవకాశం

రాచపల్లి రెవెన్యూలో 600 ఎకరాలు స్వాధీనానికి అధికారులు సన్నాహాలు



రాచపల్లి రెవెన్యూలో ప్రభుత్వ భూమి

మాకవరపాలెం, జూన్ 13 (ఆంధ్రజ్యోతి):

సుమారు నాలుగు దశాబ్దాల నుంచి రైతుల అక్రమణలో ఉన్న ప్రభుత్వ భూమిని స్వాధీనం చేసుకునేందుకు రెవెన్యూ అధికారులు సన్నాహాలు చేస్తున్నారు. నర్సీపట్నం నియోజకవర్గంలో పరిశ్రమలను ఏర్పాటు చేసేందుకు పలువురు ఔత్సాహికులు ముందుకు వస్తుండడంతో జిల్లా, డివిజన్ అధికారులు గత నెల రోజులుగా ఈ భూములను పరిశీలిస్తున్నారు. అక్రమణదారుల్లో చిన్న, సన్నకారు రైతులకు ప్రభుత్వపరంగా కొంత పరిహారం ఇవ్వడానికి ప్రభుత్వం సుముఖంగా వున్నట్టు సమాచారం.

మాకవరపాలెం మండలం రాచపల్లి రెవెన్యూ పరిధిలోని ఎరకన్నపాలెం, ధర్మవరం,రామన్నపాలెం, వెంకయ్యపాలెం, చినరాచపల్లి, గ్రామాలను ఆనుకుని సుమారు 1,450 ఎకరాల ప్రభుత్వ భూమి ఉంది. ఇందులో దాదాపు 600 ఎకరాలు రెవెన్యూ శాఖకు చెందినదిగా గుర్తించారు. ఈ భూములను ఆయా గ్రామాలకు చిన్న, సన్నకారు రైతులతో పాటు ఇతర మండలాలకు చెందిన బడాబాబులు ఆక్రమించుకొని మామిడి, జీడిమామిడి, సరుగుడు వంటి తోటలు సాగు చేసుకుంటున్నారు. కొంతమంది బడాబాబులు చేతుల్లో 20 నుంచి 30 ఎకరాల వరకు ప్రభుత్వ భూమి వున్నట్టు తెలిసింది. కాగా కేంద్ర రక్షణ మంత్రిత్వ శాఖ పరిధిలో వున్న బీడీఎల్ (భారత్ డైనమిక్స్ లిమిటెడ్) యూనిట్‌ను జిల్లాలో ఏర్పాటు చేయడానికి ఉన్నతాధికారులు కొంతకాలం క్రితం రాచపల్లి రెవెన్యూ పరిధిలోని ప్రభుత్వం భూములను పరిశీలించినట్టు తెలిసింది. జిల్లాలో ఇతర ప్రాంతాల్లో కూడా భూములను పరిశీలించిన అధికారులు.. రాచపల్లికే మొగ్గుచూపినట్టు తెలిసింది. అదే విధంగా ఆర్గానిక్ ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్ ఏర్పాటు చేయడానికి కొంతమంది ప్రైవేటు వ్యక్తులు రాచపల్లి

... మిగతా 8వ పేజీలో

అనుమానాలు అనేకం

ఘటన నేపథ్యంపై 'సాయి శ్రేయాస్' ఫార్మా గోప్యత

- నోరు మెదపని 'ఫ్యాక్టరీస్' అధికారులు
- డ్యూటీ నుంచి ఇంటికి వెళ్లిపోయిన సేఫ్టీ విభాగం అసిస్టెంట్ మేనేజర్ చంద్రశేఖర్‌ను తిరిగి రప్పించిన యాజమాన్యం
- వెళ్లిన కొద్దిసేపటికే మృతి...
- విచారణ జరిపించాలని భార్య డిమాండ్
- కంపెనీలో ఉద్యోగులకు వేధింపులు
- సేఫ్టీ అధికారులకు ఇతర బాధ్యతలు



సంఘటన జరిగిన ప్రదేశం (ఫైల్ ఫొటో)

విశాఖపట్నం, జూన్ 13 (ఆంధ్రజ్యోతి):

అనకాపల్లి జిల్లా పరవాడ రాంకీ ఫార్మా సిటీలో బుధవారం అర్ధరాత్రి దాటిన తరువాత సాయి శ్రేయాస్ కంపెనీలో విషవాయువులు పీల్చి ఇద్దరు సేఫ్టీ అధికారులు చనిపోయిన ఘటనపై అనేక అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. యాజమాన్యం ఉద్యోగుల పట్ల కక్షసాధింపు ధోరణితో వ్యవహరిస్తున్నదని, ఎవరైనా పని గంటలు, హక్కుల కోసం ప్రశ్నిస్తే వారిని వెంటనే ఉద్యోగంలో నుంచి తొలగిస్తున్నదనే ఆరోపణలు కూడా ఉన్నాయి.

ఇంటికి వెళ్లిపోయిన వారిని రప్పించారు

సాయి శ్రేయాస్ సేఫ్టీ విభాగంలో అసిస్టెంట్ మేనేజర్‌గా పనిచేస్తున్న పి.చంద్రశేఖర్ బుధవారం డ్యూటీ ముగించుకొని ఇంటికి వెళ్లిపోయారు. రాత్రి తొమ్మిది గంటల సమయంలో కంపెనీ నుంచి రమేశ్ అనే వ్యక్తి ఫోన్ చేసి, ఎఫ్లూయెంట్ ట్రీట్‌మెంట్ చేయాలి రమ్మని ఆదేశించడంతో పది గంటలకు ఆయన బయలుదేరి వెళ్లినట్టు భార్య కుసుమ చెబుతున్నారు. అలా వెళ్లినప్పుడు ఆ పని చూసుకొని ఒకటి, రెండు గంటల్లో వచ్చేస్తారని, ఆ రోజు ఇంకా రాకపోయేసరికి తాను 12 గంటలకు ఫోన్ చేశానని, ఆయన ఫోన్ ఎత్తలేదన్నారు. ఒకవేళ మీటింగ్‌లో ఉండి మాట్లాడలేని పరిస్థితి ఏదైనా ఉంటే...ఆ వాయిస్ వినిపించేవారని, ఆ రోజు ఫోన్ ఎత్తకపోవడంతో అనుమానం వచ్చి ఆయన కొలీగ్ నంబర్‌కు ఫోన్ చేయగా, ఒక్క రింగ్‌కే లిఫ్ట్ చేసి ప్రమాదం జరిగిందని చెప్పారన్నారు. కిమ్స్ ఆస్పత్రికి తీసుకువెళుతున్నారని చెప్పారని, ఆ తరువాత ఆరా తీస్తే అసలు కంపెనీలోనే ఆయన చనిపోయారని తెలిసిందన్నారు.

యాజమాన్య ప్రతినిధులు తన భర్తతో అమర్యాదగా ప్రవర్తిస్తున్నారని, ఆయన అసిస్టెంట్ మేనేజర్ అయినప్పటికీ సేఫ్టీ పనులు కాకుండా ఎవరైనా కంపెనీకి వస్తే రైల్వేస్టేషన్‌కు, ఎయిర్‌పోర్టుకి వెళ్లి వారిని పికప్ చేసుకొని రావాలని డ్రైవర్ డ్యూటీ చేయిస్తున్నారని కుసుమ ఆరోపించారు. ఇదే అంశంపై తాను భర్తతో ఒకటి, రెండు సార్లు గొడవ పడ్డానని, నువ్వు డ్రైవర్‌వా? అసిస్టెంట్ మేనేజర్‌వా?...అని అడిగానన్నారు. చాలామంది అక్కడి వేధింపులు భరించలేక మానేస్తున్నారని, తన భర్త కూడా మానేయాలని అనుకున్నా...చంటిపిల్ల ఉండడంతో వెంటనే వేరే ఉద్యోగం దొరక్కపోతే ఎలా?...అని ఆలోచించారని పేర్కొంది. యాజమాన్య ప్రతినిధులు ఒకటి, రెండు సార్లు బెదిరిస్తే...తనకు కూడా సర్కిల్ ఉందని ఆయన చెప్పడంతో వారు వెనక్కి తగ్గారని ఆమె తెలిపారు. ఈ ప్రమాద ఘటనపై తనకు

... మిగతా 8వ పేజీలో



సేఫ్టీ అసిస్టెంట్ మేనేజర్ చంద్రశేఖర్ (ఫైల్ ఫొటో)

కత్తితో భార్యపై దాడి

- తీవ్రగాయాలతో ఆస్పత్రికి తరలింపు



చికిత్స పొందుతున్న కోన దేవి

దేవరాపల్లి, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): భార్యాభర్తల మధ్య ఏర్పడిన స్పర్థలు మరింత పెరగడంతో కత్తితో భార్యపై దాడి చేసి తీవ్రంగా గాయపరిచిన సంఘటన గురువారం రాత్రి మండల కేంద్రంలో జరిగింది. ఎస్ఐ టి.మల్లీశ్వరరావు తెలిపిన ప్రకారం వివరాల ప్రకారం.. స్థానిక గాలి వీధికి చెందిన కోన రాముకి 16 ఏళ్ల క్రితం దేవితో వివాహం జరిగింది. వీరికి ఇద్దరు పిల్లలు వున్నారు. అయితే

... మిగతా 8వ పేజీలో

ప్రభుత్వ సేవలు మరింత చేరువ

డ్వాక్రా మహిళలతో కామన్ సర్వీస్ సెంటర్లు

- సంక్షేమ పథకాలకు దరఖాస్తుల స్వీకరణ
- నర్సీపట్నం, ఎలమంచిలిలో 63 మంది 'డిజిటల్ లక్ష్మి'లు

నర్సీపట్నం, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ సంక్షేమ పథకాలకు దరఖాస్తు చేసుకోవాలంటే ఇకపై సచివాలయాలకో, మీసేవా కేంద్రాలో వెళ్లాల్సిన అవసరం లేదు. మీసేవా కేంద్రం తరహాలోనే ప్రతి వీధిలో కామన్ సర్వీస్ సెంటర్లు (సీఎస్‌సీ) అందుబాటులోకి వస్తున్నాయి. డ్వాక్రా సంఘాల్లో డిగ్రీ చదువుకున్న మహిళలకు 'డిజిటల్ లక్ష్మి' అని పేరు పెట్టి ప్రభుత్వం సీఎస్‌సీల బాధ్యతలు అప్పగిస్తున్నది. ఈ కేంద్రాల్లో ప్రభుత్వ సంక్షేమ పథకాలకు దరఖాస్తు చేసుకోవచ్చు. అయితే ప్రతి సేవకు నిర్ణీత రుసుము చెల్లిచాల్సి వుంటుంది. జిల్లాలో ఎలమంచిలికి 31, నర్సీపట్నానికి 32 చొప్పున మొత్తం 63 సెంటర్లు మంజూరయ్యాయి. శుక్రవారం మెప్మా పీడీ సరోజని చేతుల మీదుగా 'డిజిటల్ లక్ష్మి'లకు డివైజ్‌లు అందజేశారు. త్వరలో వీరి ప్రత్యేక శిక్షణ ఇస్తారు. తర్వాత ఏడు శాతం వడ్డీతో రూ.2 లక్షల చొప్పున బ్యాంకు రుణాలు మంజూరు చేయిస్తారు. షాపు, ఫర్నీచర్, కంప్యూటర్లు, అవసరమైన స్టేషనరీ సమకూర్చుకోవాల్సి ఉంటుంది. ఇంటి దగ్గర చిన్నపాటి ఖాళీ స్థలంలో కియోస్క్ (బడ్డీ) పెట్టుకొని కామన్ సర్వీస్ సెంటర్లు నడుపుకోవడానికి అవకాశం కల్పిస్తున్నారు.



'డిజిటల్ లక్ష్మి'లకు డివైజ్‌లు అందజేసిన మెప్మా పీడీ సరోజని

ఆర్‌ఏఆర్‌ఎస్‌లో విక్రయానికి వరి విత్తనాలు సిద్ధం

అనకాపల్లిఅగ్రికల్చర్, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): అనకాపల్లి ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా స్థానంలో శ్రీకాకుళం సన్నాలు (ఆర్‌జీఎల్ 2537), మార్టేరు సాంబ (ఎంటీయూ 1224) ఫౌండేషన్ విత్తనాలు విక్రయానికి సిద్ధంగా ఉన్నాయని ఏడీఆర్ డాక్టర్ సిహెచ్.ముకుందరావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. మొత్తం 300 క్వింటాళ్ల విత్తనాలు అందుబాటులో వున్నాయని, 25 కిలోల బస్తా ధర రూ.1,175గా నిర్ణయించామన్నారు. ఎకరంలోపు భూమి వున్న రైతులకు ఒక బస్తా చొప్పున, ఎకరాకు మించి వున్న రైతులకు విస్తీర్ణంబట్టి రెండు లేదా మూడు బస్తాల విత్తనాలు విక్రయిస్తామన్నారు. ఈ నెల 16వ తేదీ నుంచి విత్తనాల విక్రయం ప్రారంభమవుతుందని, రైతులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని డాక్టర్ ముకుందరావు కోరారు.

చేపల వేటకు వేళాయె!

- నేటి అర్ధరాత్రితో ముగియనున్న 'రెండు నెలల' నిషేధం
- రేపటి నుంచి సముద్రంలో చేపల వేట ప్రారంభం
- వేట నిషేధ సమయంలో రెట్టింపు భృతి ఇవ్వడంతో మత్స్యకారులకు ఊరట



చేపల వేట కోసం బోటును సిద్ధం చేసుకుంటున్న మత్స్యకారులు

అచ్యుతాపురం, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): సముద్రంలో చేపలవేట శనివారం అర్ధరాత్రి నుంచి మొదలు కానున్నది. సముద్రంలో మత్స్య సంపద వృద్ధి కోసం కేంద్ర ప్రభుత్వం విధించిన రెండు నెలల విరామం శనివారంతో ముగియనున్నది. ఆదివారం నుంచి చేపల వేట సాగించడానికి మత్స్యకారులు ఏర్పాట్లు చేసుకుంటున్నారు. వలలు, బోట్లు, ఇంజన్లకు మరమ్మతులు పూర్తి చేశారు. బోట్లకు రంగులు వేశారు.

జిల్లాలో సముద్ర తీరం వెంబడి పరవాడ, అచ్యుతాపురం, రాంబిల్లి, నక్కపల్లి, ఎస్‌రాయవరం, పాయకరావుపేట మండలాలు వున్నాయి. ఆయా మండలాల్లోని పూడిమడక, బంగారమ్మపాలెం, రాజయ్యపేట, బోయపాలెం, రేవుపోలవరం, ముత్యాలమ్మపాలెం, వెంకటనగరం, రాజానగరం, కొత్తపట్నం, వాడనర్సాపురం, పాల్మన్‌పేట, కొర్లయ్యపాలెం, డీఎల్‌పురం, గజపతినగరం, పెదతీనార్ల గ్రామాల్లో

... మిగతా 8వ పేజీలో

'350 దేవాలయాల్లో గురుపౌర్ణమి రోజున బాల వికాస్ కేంద్రాలు ఏర్పాటు'



సమావేశంలో మాట్లాడుతున్న ఎస్ఎస్ఎఫ్ ఉత్తరాంధ్ర జోనల్ ప్రచారక్ గంగాధర్

ఎలమంచిలి, జూన్ 13 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థి దశ నుంచే పిల్లలు సంస్కృతీ సాంప్రదాయాలను అలవర్చుకునే విధంగా రాష్ట్రంలో 350 దేవాలయాలు కేంద్రాలుగా బాల వికాస్ కేంద్రాలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నామని సమరసతా సేవా ఫౌండేషన్ (ఎస్ఎస్ఎఫ్) ఉత్తరాంధ్ర జోనల్ ధర్మ ప్రచారక్ ఆడారి గంగాధర్ తెలిపారు. పట్టణంలో అయోధ్యపురి కాలనీలో శుక్రవారం టీటీడీ శ్రీవాణి ట్రస్టు నిధులతో నిర్మించిన ఆలయానికి చెందిన కమిటీ ప్రతినిధులతో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా ఎస్ఎస్ఎఫ్ ఆధ్వర్యంలో 822 దేవాలయాలు నిర్మించగా, 350 దేవాలయాల్లో బాల వికాస్ కేంద్రాలను ఏర్పాటు చేసి విద్యార్థుల ఉన్నతికి కృషి చేయనున్నట్టు చెప్పారు. ఈ బాల వికాస్ కేంద్రాలను గురుపౌర్ణమి రోజున ప్రతి దేవాలయంలో కమిటీల పర్యవేక్షణలో ప్రారంభించడం జరుగుతుందన్నారు. ఉత్తరాంధ్ర, గోదావరి జోన్‌ల వారికి వచ్చే నెల 6, 7 తేదీల్లో రెండు రోజుల పాటు మాతాజీలకు, ఆచార్యలకు శిక్షణ తరగతులు ఉంటాయన్నారు. ఈ సమావేశంలో జిల్లా ధర్మ ప్రచారక్ శ్రీను, మండల కన్వీనర్ రాజాన సత్యనారాయణ, అర్చక స్వామి కనకలింగం, కమిటీ ప్రతినిధులు లక్ష్మి, రాజేశ్వ పాల్గొన్నారు.

పోలీసులు పట్టుకున్న బియ్యం లారీలు విడుదల

ఎలమంచిలి, జూన్ 13 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని యర్రవరం సమీపంలో గురువారం పోలీసులు పట్టుకున్న రెండు బియ్యం లారీలను తహసీల్దార్ నివేదిక ఆధారంగా శుక్రవారం విడుదల చేసినట్టు ఎలమంచిలి పట్టణ ఎస్ఐ సావిత్రి తెలిపారు. రాజమండ్రి సమీపంలోని రాజానగరం నుంచి విశాఖ పోర్టుకు రెండు లారీల్లో బియ్యం తరలిస్తుండగా పోలీసులకు అందిన ముందస్తు సమాచారం మేరకు వీటిని పట్టుకున్నారు. అనంతరం పౌర సరఫరాల అధికారుల దృష్టికి తీసుకు వెళ్లడంతో సివిల్ సప్లై డీటీ పి.సోమశేఖర్ బియ్యం శాంపిళ్లను తీసి ల్యాబ్‌కు పంపించారు. ల్యాబ్ నివేదిక వచ్చిందని, ఇవి పీడీఎఫ్ బియ్యం కాదని తేలడంతో తహసీల్దార్ నివేదిక మేరకు సదరు లారీలను విడిచిపెట్టినట్టు ఎస్ఐ చెప్పారు.

కళాశాల విద్యార్థులకు సన్న బియ్యంతో భోజనం

ఎలమంచిలి, జూన్ 13 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకంలో భాగంగా ఎలమంచిలిలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులకు శుక్రవారం నుంచి సన్న బియ్యాన్ని వండి వడ్డిస్తున్నట్టు ప్రిన్సిపాల్ విజయ్ కుమార్ తెలిపారు. ఇప్పటికే కళాశాలకు సన్న బియ్యం స్టాకు వచ్చిందన్నారు. ఇకపై ఈ బియ్యం పాటు పోషక విలువలతో కూడిన ఆహారాన్ని విద్యార్థులకు వండి పెడతామని వివరించారు.

గూడుపమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు

నక్కపల్లి, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): రేబాక గూడుపమ్మ తల్లి ఆలయాన్ని భవిష్యత్తు లో భక్తుల మరింత ఆదరణ పొందుతుందని ఉపమాక వేంకటేశ్వరస్వామి దేవస్థానం మాజీ చైర్మన్ చిలువూరి రామ సూర్యనారాయణరాజు (పెంకులరాజు) అభిప్రాయపడ్డారు. శుక్రవారం ఈ ఆలయాన్ని ఏఎస్ఆర్ ఎస్టేట్స్ అధినేత అడబాల నారాయణమూర్తి, గున్నాబత్తుల వెంకట రమణ, ఉపమాక దేవస్థానం మాజీ చైర్మన్ పెంకులరాజు సహా పలువురు భక్తులు దర్శించుకున్నారు. ఆలయంలో అమ్మవారికి శుక్రవారం ఉదయం ప్రత్యేక పూజలు చేసి హారతులిచ్చారు. భక్తుల గోత్రనామాలతో పూజా కార్యక్రమాలు చేశారు. ఈ సందర్భంగా సూర్యనారాయణరాజు మాట్లాడుతూ, ఈ ఆలయం ఆలయ విశిష్టత, మహిమలు గురించి చాలా మంది తెలుసుకున్నారన్నారు. ఈ సందర్భంగా నారాయణమూర్తి, పెంకులరాజు, వెంకట రమణను రేబాక సర్పంచ్ సాదిరెడ్డి శ్రీను, కరణం ఈశ్వరరావు అమ్మవారి శేషవస్త్రం, చిత్రపటంతో సత్కరించారు.

గంజాయి కేసులో నిందితుడికి జైలు, జరిమానా

నర్సీపట్నం, జూన్ 13(ఆంధ్రజ్యోతి): గంజాయి రవాణా కేసులో నిందితుడికి రెండేళ్ల జైలు శిక్ష, రూ.10 వేల జరిమానా విధిస్తూ న్యాయమూర్తి తీర్పు ఇచ్చారు. శుక్రవారం ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ సునీల్‌కుమార్ తెలిపిన వివరాలు ఇలా వున్నాయి. 2014 అక్టోబరు 10న నర్సీపట్నం మునిసిపాలిటీ శివపురానికి చెందిన తుమ్మల వెంకటేశ్వరరావును 10 కిలోల గంజాయితో ఎక్సైజ్ అధికారులు పట్టుకుని అరెస్టు చేసి రిమాండ్ తరలించారు. తర్వాత కేసు విచారణ పూర్తి చేసి విశాఖ ఎంఎస్‌జే కోర్టు చార్జ్‌షీటు దాఖలు చేసింది. ప్రభుత్వం తరఫున న్యాయవాది వాదనలు వినిపించి నేరం రుజువు చేయడంతో నిందితుడికి రెండేళ్ల జైలు శిక్ష, రూ.10 వేలు జరిమానా విధిస్తూ న్యాయమూర్తి తీర్పు ఇచ్చారు.

విద్యా కిట్లు పంపిణీ



పిల్లలకు సర్వేపల్లి రాధాకృష్ణ కిట్లు పంపిణీ చేస్తున్న దృశ్యం

నక్కపల్లి, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పెదబోదిగల్లం జడ్పీ హైస్కూల్‌లో శుక్రవారం విద్యార్థులకు సర్వేపల్లి రాధాకృష్ణ విద్యార్థి మిత్ర కిట్లను పంపిణీ చేశారు. సర్పంచ్ మున్నీషాబేగం, హెచ్ఎం కె.జయశ్రీ,పెద్దలు బషీర్, బి.లక్ష్మణరావు, ఇమామ్ హుస్సేన్ తదితరులు విద్యార్థులకు ఈ కిట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ ప్రభుత్వం అందిస్తున్న ప్రోత్సాహకాలను విద్యార్థులు సద్వినియోగపర్చుకుని , ఉన్నతంగా చదవాలని సూచించారు. పాఠశాలలు పునఃప్రారంభమైనప్పటి నుంచి మధ్యాహ్న భోజనంలో సన్నబియ్యం వినియోగించడం శుభ పరిణామమన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఎస్‌వీఎస్ ఆచార్యులు, ఫాల్గుణరావు పాల్గొన్నారు.

పాయకరావుపేట పంచాయతీ కార్యదర్శిగా లవరాజు

పాయకరావుపేట, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): పాయకరావుపేట పంచాయతీ కార్యదర్శిగా ఎంవీఎస్ లవరాజు నియమితులయ్యారు. ఇప్పటి వరకు మండలంలో పీఎల్. పురం పంచాయతీ కార్యదర్శి శివరాం పాయకరావుపేట పంచాయతీ ఇన్‌చార్జి కార్యదర్శిగా విధులు నిర్వహిస్తుండగా, వడ్డాది నుంచి బదిలీపై వచ్చిన లవరాజు రెగ్యులర్ బాధ్యతలను శుక్రవారం చేపట్టారు. ఈయన 2016 నుంచి 2019 వరకు పాయకరావుపేట పంచాయతీ కార్యదర్శిగా పనిచేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టణ అభివృద్ధికి తన వంతు కృషిచేస్తానని తెలిపారు.

రుణ రికవరీకి వెళ్లిన బ్యాంకు సిబ్బందిపై దాడి

అనకాపల్లి, జూన్ 13(ఆంధ్రజ్యోతి): రికవరీకి వెళ్లిన బ్యాంకు సిబ్బందిపై రుణం తీసుకున్న వ్యక్తి దాడి చేసిన సంఘటన జానకిరాంపురంలో శుక్రవారం చోటుచేసుకుంది. దీనికి సంబంధించి పోలీసులు తెలిపిన వివరాలు ఇలా వున్నాయి. జిల్లా కేంద్ర సహకార బ్యాంకు(డీసీసీబీ) నర్సీపట్నం బ్రాంచి పరిధిలోని రోలుగుంట మండలం జానకిరాంపురం పీఏసీఎస్‌లో 2019లో స్వయంకృషి పథకం కింద అదే గ్రామానికి చెందిన మేడపురెడ్డి రమేశ్ రుణం తీసుకున్నారు. అప్పటి నుంచి చెల్లింపులు జరపకపోవడంతో రుణ బకాయి రూ.2 లక్షలకు పైగా చేరింది. దీంతో శుక్రవారం బ్రాంచి మేనేజర్ సత్యనారాయణ, నోడల్ ఆఫీసర్ రామకృష్ణ, ఏజీఎం అశోక్‌కుమార్, తదితరులు రమేశ్ ఇంటికి వెళ్లి తీసుకున్న రుణం చెల్లించమని అడిగారు. దీంతో వారిని రమేశ్ దుర్భాషలాడడంతో పాటు దాడికి పాల్పడ్డాడు. ఈ ఘటనపై శుక్రవారం బ్రాంచి మేనేజర్ సత్యనారాయణ ఆధ్వర్యంలో బ్రాంచి సిబ్బంది, పీఏసీఎస్ సిబ్బంది రోలుగుంట పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

ఉదయం నుంచి వేచి ఉన్నా వేలిముద్ర పడలే..



సర్వర్ మందగించడంతో వేలిముద్ర పడక ఇబ్బందులు

- 'అన్నదాత సుఖీభవ'లో పేర్ల నమోదుకు వ్యవసాయ కార్యాలయానికి రైతులు రాక
- సర్వర్ మొరాయించడంతో గంటల తరబడి పడిగాపులు
- చేసేది లేక ఇంటిముఖం ▸ ఎవరూ ఆందోళన చెందవద్దన్న అధికారులు



ఎలమంచిలి వ్యవసాయ శాఖ కార్యాలయం వద్ద పడిగాపులు కాస్తున్న రైతులు

ఎలమంచిలి, జూన్ 13 (ఆంధ్రజ్యోతి) : అన్నదాత సుఖీభవ పథకానికి పేర్ల నమోదుకు పలువురు రైతులు అష్టకష్టాలు పడుతున్నారు. శుక్రవారం సర్వర్ పనిచేయక పోవడంతో పట్టణంలోని వ్యవసాయ శాఖ కార్యాలయం వద్ద ఉదయం నుంచి పడిగాపులు కాశారు. ఈ పథకంలో నమోదు కావాలంటే రైతులు విధిగా వేలిముద్ర వేసుకోవాలని అధికారులు తెలపడంతో రైతులు పెద్ద సంఖ్యలో వ్యవసాయ శాఖ కార్యాలయానికి చేరుకున్నారు. సర్వర్ మందగించడంతో వేలిముద్రలు నమోదు కాలేదు. సర్వర్ అప్‌డేట్ చేస్తుండడం వల్ల ఈ సమస్య తలెత్తి ఉండవచ్చునని కార్యాలయ సిబ్బంది తెలిపారు. ఎలమంచిలి మండలంలో 8,124 మంది రైతులు అన్నదాత సుఖీభవ పథకానికి బయోమెట్రిక్ నమోదు చేయించుకోవాల్సి ఉందని వ్యవసాయాధికారుల అంచనా. వీరంతా ప్రతి రైతు సేవా కేంద్రంలో వ్యవసాయ సహాయకులు ద్వారా బయోమెట్రిక్ వేయించుకోవాల్సి ఉంటుంది. దీంతో వీరంతా పట్టణంలోని ఏవో కార్యాలయంలోని కేంద్రాని వెళ్లారు. ఉదయం పది గంటల నుంచి పడిగాపులు కాసినా తాము వెళ్లిన పని జరగలేదని పలువురు ఆవేదన వ్యక్తం చేశారు. రైతులు ఆందోళన చెందవద్దని, సర్వర్ పనిచేసిన వెంటనే అందరికీ సమాచారం అందజేస్తామని కార్యాలయ అధికారులు తెలిపారు.

'తల్లికి వందనం'పై వైసీపీ తప్పుడు ప్రచారం

- రాష్ట్ర రహదారుల అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ ప్రగడ



విలేకరులతో మాట్లాడుతున్న ప్రగడ నాగేశ్వరరావు

అచ్యుతాపురం, జూన్ 13 (ఆంధ్రజ్యోతి) : తల్లికి వందనం పథకంపై వైసీపీ నాయకులు చేస్తున్న వ్యాఖ్యలు వారి దిగజారుడు తనానికి నిదర్శనమని రాష్ట్ర రహదారులు అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ ప్రగడ నాగేశ్వరరావు అన్నారు. శుక్రవారం ఆయన ఇక్కడ విలేకరులతో మాట్లాడుతూ ఇంట్లో ఎంతమంది విద్యార్థులుంటే అంతమందికీ తల్లికి వందనం పథకం కింద రూ.15 వేలు ఇస్తుంటే, వైసీపీ నేతలు తప్పుడు ప్రచారాలు చేస్తున్నారని మండిపడ్డారు. రూ.రెండు వేలు లోకేశ్ జేబులోకి పోతాయంటూ వైసీపీ నాయకులు దిగజారుడు ఆరోపణలు చేస్తున్నారని ఎద్దేవా చేశారు. వైసీపీ హయాంలో రూ.13 వేలు ఇచ్చారని, అప్పుడు మిగిలిన రెండు వేలు జగన్ జేబులోకి వెళ్లాయా.. లేక తాడేపల్లి ప్యాలెస్‌కి వెళ్లాయా.. అని ప్రగడ ఎదురు ప్రశ్నించారు. జగన్ పాలనలో 42 లక్షల మంది విద్యార్థులకు ఈ పథకం వర్తిస్తే, కూటమి ప్రభుత్వం 67.27 లక్షల మందికి ఇస్తుందన్నారు. వైసీపీ ప్రభుత్వంలో కుటుంబంలో ఒకరికి మాత్రమే ఈ పథకం వర్తింపజేసేవారన్నారు. కేజీ నుంచి పీజీ వరకు ఉచిత విద్య అందిస్తానని చెప్పి ఎంతవరకు చదువుకుంటే అంతవరకు చదివిస్తానని మేనమామగా చెపుతున్నానని చెప్పి బడుగు, బలహీన వర్గాలతో పాటు మైనారిటీ వర్గాలకు చెందిన 12 లక్షల మంది విద్యార్థుల భవిష్యత్ నాశనం చేసింది మీరు కాదా.. అని ఆయన వైసీపీ నాయకులను నిలదీశారు. పారదర్శకతకు పెద్ద పీటవేస్తూ అర్హత ఉన్న ప్రతి విద్యార్థికి లబ్ధి చేకూరుస్తుంటే, బెంగళూరులో కూర్చొని జగన్ విషప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. విద్యార్థులకిచ్చే చిక్కీలు, కోడిగుడ్లు, కందిపప్పులో కూడా కమీషన్లు తీసుకున్న ఘన చరిత్ర వైసీపీది కాదా అన్నారు. ప్రస్తుతం తల్లికి వందనం కింద తల్లుల ఖాతాల్లోకే నేరుగా డబ్బులు జమ చేస్తుంటే చూడలేక వైసీపీ శ్రేణులు తప్పుడు ప్రకటనలు చేస్తున్నారన్నారు. ఇటువంటి నాయకులకు ప్రజలు మళ్లీ బుద్ధి చెప్పేందుకు సిద్ధంగా ఉన్నారన్నారు.

హేచరీలో బాలుడికి గాయాలు

- బాధితుడు పాయకరావుపేట మండల వాసి



ఉలవపాడులో శ్రీనివాస హేచరీ ప్రతినిధిని ప్రశ్నిస్తున్న ఎస్ఐ అంకమ్మ

ఉలవపాడు, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): ప్రకాశం జిల్లా ఉలవపాడు మండం కరేడు పంచాయతీ అలగాయపాలెం తీర ప్రాంతంలోని శ్రీనివాస హేచరీలో పని చేస్తున్న 16 ఏళ్ల బాలుడు ప్రమాదానికి గురైన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. స్థానిక ఎస్ఐ అంకమ్మ కథనం మేరకు.. అనకాపల్లి జిల్లా, పాయకరావుపేట మండలం ఈదటం గ్రామానికి చెందిన నెమల తేజ తాతారావు 10వ తరగతి చదువుతున్నాడు. కాగా అదే ప్రాంతానికి చెందిన బాలుడి స్నేహితుడు నగేశ్ కొంతకాలంగా అలగాయపాలెం లోని శ్రీనివాస హేచరీలో దినసరి కూలీగా పనిచేస్తున్నాడు. వేసవి సెలవులు కావడంతో తాతారావు తన స్నేహితుడి నగేశ్ దగ్గరకు వచ్చి మే 3వ తేదీన శ్రీనివాస హేచరీలో పనికి చేరాడు. అదే నెల 27వ తేదీ న రొయ్య పిల్లల ట్యాంక్ శుభ్రం చేస్తున్న క్రమంలో కాలుజారి నిచ్చెన పై నుంచి కిందపడి తలకు బలమైన గాయాలయ్యాయి. అదే సమయంలో బక్కెట్‌లోని యాసిడ్ కళ్లల్లో పడింది. హేచరీ యాజమాన్యం క్షతగాత్రుడిని ఎల్‌వీ ప్రసాద్ ఆసుపత్రిలో చికిత్స చేయించి బాలుడి స్వగ్రామానికి పంపించారు. బాలుడి తల్లిదండ్రులు తుని ఆసుపత్రిలో వైద్యులకు చూపించగా. తలకు శస్త్ర చికిత్స చేయాలని సూచించారు. ఆసుపత్రిలో బాలుడి ఫిర్యాదుని నమోదు చేసుకున్న వైద్యులు ఉలవపాడు పోలీసులకు సమాచారమిచ్చారు. స్థానిక ఎస్ఐ అంకమ్మ, లేబర్ ఇన్‌స్పెక్టర్ సుజాతతో కలిసి శుక్రవారం విచారణ చేపట్టారు

పాఠ్య పుస్తకాలు పంపిణీ



మునగపాక జెడ్పీ స్కూల్‌లో విద్యార్థినులకు పుస్తకాలు పంపిణీ చేస్తున్న ఉపాధ్యాయులు

మునగపాక, జూన్ 13 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో ఉచితంగా పాఠ్య, నోట్ పుస్తకాలు పంపిణీ ప్రారంభమైంది. స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు శుక్రవారం ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాసరావు, పాఠశాల యాజమన్యా కమిటీ చైర్మన్ ఆడారి సూర్యచంద్రరామారావు పుస్తకాలను పంపిణీ చేశారు. అలాగే, పాటిపల్లిలోని ఏపీ మోడల్ స్కూల్‌లె హెచ్ఎం పి.పి.ఎస్ .శ్రీలక్ష్మి, కమిటీ చైర్మన్ భీశెట్టి జోగినాయుడు పుస్తకాలను అందజేసి శ్రద్ధగా చదువుకోవాలని సూచించారు.

ఘనంగా రామాలయ వార్షికోత్సవం

మునగపాక, జూన్ 13 (ఆంధ్రజ్యోతి) : వెంకటాపురంలోని శ్రీరామాలయ వార్షికోత్సవాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామి అమ్మవార్లకు విశేష పూజలు చేపట్టారు. పెద్ద సంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు. మధ్యాహ్నం అన్నసమారాధన జరిపారు. ఈ వేడుకల్లో సర్పంచ్ సుందరపు నీలకంఠస్వామి, ఎంపీటీసీ మద్దాల వీరునాయుడు, వీఆర్వోల సంఘం రాష్ట్ర ప్రతినిధి బొమ్మిరెడ్డిపల్లి శ్రీనివాసరావు, పాల సొసైటీ అధ్యక్షుడు సుందరపు కాసులు బాబు, ఆడారి కాశి తదితరులు పాల్గొన్నారు.

'కష్టాల్లో ఉన్నవారికి పీఎంజేజేబీవై అండ'



మృతుని కుటుంబానికి చెక్కు అందిస్తున్న బీఎం

అచ్యుతాపురం, జూన్ 13 (ఆంధ్రజ్యోతి) : కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రధాన మంత్రి జీవన జ్యోతి బీమా యోజన పథకం కష్టాల్లో ఉన్నవారికి అండగా నిలుస్తుందని ఎస్‌బీఐ దుప్పితూరు బ్రాంచ్ మేనేజర్ కె.సత్యసాయి రమేష్ అన్నారు. ఈ పథకం కింద మంజూరైన రూ.రెండు లక్షల పరిహారం చెక్కును శుక్రవారం బాధిత కుటుంబ సభ్యులకు అందజేసి మాట్లాడారు. ఈ పథకం కింద సంవత్సరానికి కేవలం రూ.436 చెల్లిస్తే బీమా పొందిన వారు మృతిచెందితే ఆ కుటుంబ సభ్యులకు రూ.రెండు లక్షల పరిహారం అందుతుందన్నారు. పూడిమడకకు చెందిన మైలపల్లి గంజాం ఈ పథకంలో చేరి ఇటీవలే మరణించగా, ఆమె నామినీ అయిన కాసులమ్మకు సదరు చెక్కును అందజేశామన్నారు.

రేవుపోలవరంలో వెయ్యి మందితో యోగాసనాలు రేపు

- హాజరుకానున్న హోం మంత్రి అనిత, జిల్లా కలెక్టర్



రేవుపోలవరంలో తీర ప్రదేశాన్ని పరిశీలిస్తున్న తహసీల్దార్, టీడీపీ నాయకులు

ఎస్. రాయవరం, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): యోగాంధ్రలో భాగంగా మండలంలోని రేవుపోలవరం సముద్రతీరం వద్ద ఆదివారం వెయ్యి మందితో యోగాసనాల కార్యక్రమం నిర్వహించనున్నట్టు స్థానిక తహశీల్దార్ జె. రమేశ్‌బాబు తెలిపారు. శుక్రవారం టీడీపీ మండల అధ్యక్షుడు అమలకంటి అబద్ధంతో కలిసి తహశీల్దార్, సీఐ రామకృష్ణ యోగా నిర్వహించే ప్రదేశాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆహ్లాదకరమైన రేవుపోలవరం సముద్రతీరంలో నిర్వహించే ఈ యోగా కార్యక్రమంలో రాష్ట్ర హోం మంత్రి వంగలపూడి అనిత, కలెక్టర్ విజయ కృష్ణన్ హాజరుకానున్నారని తెలిపారు. పాయకరావుపేట నియోజకవర్గంలోని నాలుగు మండలాలకు చెందిన ఉద్యోగులంతా భాగస్వాములవుతారన్నారు. వెయ్యి మందితో ఏర్పాటుచేసే యోగా కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు గుర్రం రామకృష్ణ, అడవి రాజు తదితరులు పాల్గొన్నారు.



ఎస్. రాయవరంలో సెక్రటరీలు,వీఆర్వోలతో సమావేశం నిర్వహిస్తున్న ఎంపీడీవో సీతారామరాజు

నేడు అన్ని గ్రామాల్లో యోగా ప్రొటోకాల్

నక్కపల్లి: యోగాంధ్ర కార్యక్రమంలో భాగంగా శనివారం ఉదయం 7 గంటల నుంచి 8 గంటల వరకు మండలంలోని అన్ని గ్రామాల్లో ప్రొటోకాల్ యోగాసనాల కార్యక్రమం నిర్వహించాలని ఎంపీడీవో డి. సీతారామరాజు సూచించారు. శుక్రవారం తన కార్యాలయంలో సెక్రటరీలు, వీఆర్వోలతో నిర్వహించిన సమావేశంలో పలు ఆదేశాలు జారీ చేశారు. ఈనెల 21 అంతర్జాతీయ యోగా డేను విశాఖ కేంద్రంగా ఘనంగా నిర్వహించేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చర్యలు చేపడుతున్నాయన్నారు. ఇప్పటికే ప్రొటోకాల్ ఆసనాలపై శిక్షణ పొందిన వారందరితో ఆయా గ్రామాల్లో శనివారం ఉదయం ఏకకాలంలో డెమో ఇవ్వాలని సూచించారు. వెంటనే ఈ ఫొటోలను యోగాంధ్ర యాప్‌లో అప్‌లోడ్ చేయాలని కోరారు. ప్రతీ ఒక్కరూ ఎంతో బాధ్యతగా ఈ కార్యక్రమాన్ని విజయవంతంగా పూర్తి చేయాలని ఎంపీడీవో ఆదేశించారు.

నూకాలమ్మ ఆలయ భూములకు నష్టపరిహారం ఇవ్వాలి



తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న రాజయ్యపేట గ్రామ పెద్దలు

నక్కపల్లి, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రాజయ్యపేట లోని పలు సర్వే నంబర్లలో ఉన్న సుమారు 9 ఎకరాల నూకాలమ్మ ఆలయానికి మాన్యానికి సంబంధించి నష్టపరిహారం చెల్లించాలని టీడీపీ నియోజకవర్గం కన్వీనర్ కొప్పిశెట్టి వెంకటేశ్ ఆధ్వర్యంలో ఆ గ్రామ పెద్దలు కోరారు. శుక్రవారం తహసీల్దార్ నర్సింహమూర్తిని ఆ గ్రామ పెద్దలు, మత్స్యకార నాయకులు పిక్కి సత్తియ్య, పిక్కి గంగరాజు, పిక్కి దేముడు, పిక్కితాతీలు, శివాజీ, సిరిపల్లి అప్పలరాజు తదితరులు కలిసి వినతిపత్రం అందజేశారు. ఏపీఐఐసీ సేకరించిన అమ్మవారి ఆలయ భూముల్లో చెట్లు, తోటలు తొలగించకముందే పరిహారం ఇవ్వాలని కోరారు. గోసల స్వామి, చేపల సోమేశ్, మైలపల్లి నల్ల పాల్గొన్నారు.

రుచికరం, పౌష్టికరం.. మధ్యాహ్న భోజనం

- పాఠశాలల్లో సన్న బియ్యంతో వంటలు
- మెనూ మార్పుతో విద్యార్థుల ఆనందం



పాఠశాలలకు 25 కిలోల సరఫరా చేసిన సన్న బియ్యం బస్తా

కోటవురట్ల, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలలు, ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో సన్న బియ్యంతో మధ్యాహ్న భోజనాలను అందిస్తుండడంతో విద్యార్థులు ఆనందం వ్యక్తంచేస్తున్నారు. ఇంత వరకు దొడ్డబియ్యంతో వండిన భోజనాలు చేయలేక కొందరు ఇళ్లనుంచి క్యారేజీలను తీసుకువచ్చేవారు. ఈ స్థితిలో కూటమి ప్రభుత్వం ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు రుచికరమైన, పౌష్టికాహారంతో కూడిన భోజనం అందించాలని నిర్ణయం తీసుకుంది. డొక్కాసీతమ్మపేరుతో సమూల మార్పులకు శ్రీకారం చుట్టింది. వేసవి సెలవులు పూర్తికావడంతో గురువారం నుంచి పాఠశాలలు పునః ప్రారంభంనుంచి మధ్యాహ్నభోజనంలో ప్రభుత్వం నిర్దేశించిన మెనూ ప్రకారం భోజనాలు వడ్డిస్తున్నారు. పాఠశాలలకు కాలేజీలకు, కేజీబీవీ పాఠశాలలకు వసతిగృహాలకు పౌరసరఫరశాఖ నుంచి విద్యాశాఖ సన్నబియ్యం సరఫరా చేసింది. కోటవురట్లలోని ప్రభుత్వ జూనియర్‌కళాశాల, కేజీబీవీ ఇంటర్మీడియేట్ కళాశాలతోపాటు ప్రభుత్వ హైస్కూల్, ఐదు జడ్పీ ఉన్నత పాఠశాలలు, 5 యూపీ స్కూల్స్, రెండు మోడల్ స్కూల్స్, కేజీబీవీ పాఠశాల, ఎస్సీ బాలికల వసతిగృహం, బీసీ సమీకృత బీసీ వసతిగృహం, కాకుండా ఒకటినుంచి పదో తరగతివరకు సుమారు నాలుగువేలమంది విద్యార్థులు విద్యాభ్యాసం చేస్తున్నారు. మధ్యాహ్న భోజనం కోసం ప్రత్యేకంగా 25 కేజీలు సంచులు సిద్ధంచేసింది. గతంలో 50 కేజీ బస్తాలను సరఫరా చేసేవారు. అవి ఎక్కువరోజులు నిల్వ ఉండటంతో పురుగుల పట్టేవి. సగానికి తగ్గించడం వల్ల ఇబ్బందిలేదు. అలాగే, ఎలాంటి అక్రమాలు జరగకుండా క్యూఆర్ కోడ్‌ఉన్న ట్యాగ్ అ మర్చుతున్నారు.

పాయకరావుపేట ఈవోపీఆర్డీగా డేవిడ్



బాధ్యతలు స్వీకరించిన డేవిడ్

పాయకరావుపేట, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): పాయకరావుపేట ఈఓపీఆర్డీగా కె. డేవిడ్ శుక్రవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. ఈయన ఇటీవల జి.మాడుగుల నుంచి పాయకరావుపేటకు బదిలీ కాగా, ఇప్పటి వరకు ఇక్కడ పనిచేసిన సీహెచ్. చంద్రశేఖర్ చీడికాడ మండలానికి బదిలీపై వెళ్లారు. అలాగే, ఇప్పటి వరకు మండల స్థాయిలో ఈఓపీఆర్డీగా ఉన్న పోస్టును ప్రభుత్వం డిప్యూటీ ఎంపీడీఓగా మార్చడంతో ఇక నుంచి ఈ మేరకు పరిగణించనున్నట్టు ఎంపీడీఓ కార్యాలయ ఏఓ తెలిపారు.

సామూహిక అక్షరాభ్యాసాలు



అంగన్‌వాడీల్లో పిల్లలను చేర్పించాలంటూ ర్యాలీ చేస్తున్న దృశ్యం

నక్కపల్లి, జూన్ 13 (ఆంధ్రజ్యోతి):మండలంలోని దోసలపాడు అగ్రహారం అంగన్‌వాడీ కేంద్రంలో సామూహిక అక్షరాభ్యాస కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. ముఖ్య అతిథులుగా సీడీపీవో శ్రీవిద్య, సూపర్‌వైజర్ కె.లలిత హాజరయ్యారు. అంగన్‌వాడీల్లో అడ్మిషన్లు పొందిన పిల్లలతో సామూహిక అక్షరాభ్యాస కార్యక్రమం చేయించారు. అనంతరం పిల్లలను అంగన్‌వాడీ కేంద్రంలో చేర్పించాలంటూ అవగాహన ర్యాలీ చేపట్టారు. కార్యక్రమంలో టీచర్లు ప్రశాంతి కుమారి, అశ్విని, అంగన్‌వాడీ కార్యకర్తలు పి.పద్మ, వి.మంగమ్మ తదితరులు పాల్గొన్నారు.

చినబొడ్డేపల్లిలో సీసీ కెమెరాలు ఏర్పాటు



దాతల సహకారంతో మెయిన్‌రోడ్డులో ఏర్పాటుచేసిన సీసీ కెమెరాలు

కోటవురట్ల, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): కోటవురట్లమండలం చినబొడ్డేపల్లి జంక్షన్ మెయిన్‌రోడ్డు మూడుశివారుగ్రామాల సరిహద్దు ప్రాంతాల్లో దాతలు విరాళాలతో పోలీసులు సీసీ కెమెరాలు ఏర్పాటుచేశారు. శుక్రవారం పీకేపల్లి చినబొడ్డేపల్లి, అక్కానాయుడుపేట జంక్షన్ కోస్టల్ ఆక్వాప్రైవేట్ లిమిటెడ్‌కి చెందిన దాట్ల రామచంద్రరాజు, పీకేపల్లి గ్రామపెద్దలుసూరెడ్డి సత్యనారాయణ సహకారంతో సీసీ కెమెరాలను ఏర్పాటుచేసినట్టు ఎస్ఐ రమేశ్ తెలిపారు. వీటి వల్ల గంజాయి అక్రమణ, దొంగతనాలు, చట్టవిరుద్ధమైన పనులు చేసినా సమాచారం రాబట్టేందుకు ఉపయోగకరంగా ఉంటాయని ఆయన తెలిపారు. ఇదే స్ఫూర్తితో ఇతరగ్రామాల్లో దొంగతనాలు నివారణ సీసీ కెమెరాలు ఏర్పాటుకు దాతలు ముందుకురావాలని కోరారు.

ఎన్‌సీసీ క్యాడెట్ల క్రమశిక్షణ యువతకు ఆదర్శం

▸▸ సుప్రీం కోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ లావు నాగేశ్వరరావు



ఎన్‌సీసీ క్యాడెట్లను ఉద్దేశించి ప్రసంగిస్తున్న జస్టిస్ లావు నాగేశ్వరరావు

సబ్బవరం, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): ఎన్‌సీసీ క్యాడెట్స్ క్రమశిక్షణ యువతకు ఎంతో ఆదర్శమని సుప్రీం కోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ లావు నాగేశ్వరరావు అన్నారు. సబ్బవరం దామోదరం సంజీవయ్య జాతీయ న్యాయ విశ్వవిద్యాలయంలో 13వ ఆంధ్ర బెటాలియన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఎన్‌సీసీ వార్షిక శిక్షణ శిబిరం-6 ముగింపు వేడుకలు శుక్రవారం ఘనంగా జరిగాయి. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన జస్టిస్ లావు నాగేశ్వరరావు మాట్లాడుతూ ఎన్‌సీసీ క్యాడెట్లు భవిష్యత్తులో దేశానికి మంచి సేవలందించాలని ఆకాంక్షించారు. అంతకు ముందు క్యాంపు కమాండెంట్ లెఫ్టినెంట్ కల్నల్ స్వర్నిమ్ ప్రభాత్ శిక్షణ శిబిరం వివరాలు వెల్లడించారు. వీసీ ప్రొఫెసర్ డి.సూర్యప్రకాశరావు మాట్లాడుతూ 468 మంది క్యాడెట్లకు శిక్షణ కార్యక్రమం నిర్వహించినట్టు చెప్పారు. అనంతరం జస్టిస్ లావు నాగేశ్వరరావును, వీసీని క్యాంప్ కమాండెంట్ కల్నల్ స్వర్నిమ్ ప్రభాత్ సన్మానించారు. కార్యక్రమంలో సుబేదార్ మేజర్ శ్రీనివాసరావు, ఎన్‌సీసీ అధికారులు, కెప్టెన్‌లు జగదీప్, మూర్తి, లెఫ్టినెంట్ విద్యాసాగర్, డాక్టర్ హరణి, గోవింద, జస్వంత్, రాజు, ఉన్నీష్, భవానీ శంకర్, సంతోషి, రూప, డాక్టర్ ఈరన్న, బంగారునాయుడు తదితరులు పాల్గొన్నారు.

మత్తు పదార్థాల వాడకం ప్రమాదకరం

▸▸ గంజాయి, సారా వంటి వాటికి యువత దూరంగా ఉండాలి

▸▸ కొత్తపల్లి అవగాహన సదస్సులో సీఐ స్వామినాయుడు



కొత్తపల్లిలో గ్రామస్థులను ఉద్దేశించి మాట్లాడుతున్న సీఐ స్వామినాయుడు

కశింకోట, జూన్ 13 (ఆంధ్రజ్యోతి) : మత్తు పదార్థాల వాడకం వల్ల కలిగే నష్టాలను యువత తెలుసుకోవాలని సీఐ అల్లు స్వామినాయుడు సూచించారు. కొత్తపల్లి గ్రామంలో శుక్రవారం రాత్రి నషాముక్తి అభియాన్‌లో భాగంగా మాదక ద్రవ్యాల వినియోగం, నాటుసారా తాగడం, గంజాయిని పీల్చడం వంటి వాటి వల్ల కలిగే అనర్థాలపై నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. ప్రస్తుత సమాజంలో పెరుగుతున్న సైబర్ నేరాల పట్ల అంతా అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఓటీపీ మోసాలు, ఫోన్‌కాల్స్ ద్వారా వ్యక్తిగత సమాచారం తెలుసుకొని బ్యాంకు ఖాతాలో డబ్బు దోచుకోవడం జరుగుతున్నాయని, వీటిపట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. నాటుసారా తయారీ, విక్రయాలు చట్టవిరుద్ధమని పేర్కొన్నారు. ఇటువంటి వాటికి పాల్పడేవారు ఎంతటి వారైనా చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ కార్యక్రమలో ఎస్ఐ లక్ష్మణరావుతో పాటు పెద్ద సంఖ్యలో గ్రామస్థులు పాల్గొన్నారు.

'ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ మానటరింగ్ కమిటీ ఏర్పాటు'

తుమ్మపాల, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఎస్సీ, ఎస్టీ అత్యాచార కేసుల పరిశీలన, విచారణ కోసం జిల్లా విజిలెన్స్ అండ్ మానటరింగ్ కమిటీ ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నట్టు కలెక్టర్ విజయకృష్ణన్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. కమిటీలో ఎస్సీ, ఎస్టీలు ఐదుగురు, ఎన్‌జీవోలు, ఇతర కులాలకు చెందిన వారు ముగ్గురిని ఏర్పాటు చేస్తామన్నారు. ఈ కమిటీ రెండేళ్ల పాటు పనిచేస్తుందన్నారు. కమిటీ సభ్యులుగా పనిచేసేందుకు ఆసక్తి కలిగిన వారు ఈ నెల 25వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

44 కిలోల గంజాయితో ముగ్గురి అరెస్టు



గంజాయితో పాటు నిందితులను చూపుతున్న ఎస్ఐ

కొత్తూరు, జూన్ 13 (ఆంధ్రజ్యోతి) : అనకాపల్లి మండలం సిరసపల్లి గ్రామం లోని ఓ ఇంటి గదిలో ఉన్న 44 కిలోల గంజాయిని పట్టుకున్నట్టు రూరల్ పోలీసు స్టేషన్ ఎస్ఐ జి.రవికుమార్ తెలిపారు. ఈ సంఘటనకు సంబంధించి ఆయన కథనం ప్రకారం వివరాలివి. అల్లూరి సీతారామరాజు జిల్లా పెదబయలు మండలానికి చెందిన పొత్రంగి వరుణ్‌తేజ, పొత్రంగి శామ్యూల్, వంతల మహేష్ ముగ్గురూ కలిసి ఇరవై రోజుల క్రితం సిరసపల్లిలో ఒక ఇంట్లో గదిని అద్దెకు తీసుకున్నారన్నారు. అప్పటి నుంచి అనుమానాస్పదంగా ఉండడంతో స్థానికులు సీఐ అశోక్‌కుమార్‌కు సమాచారం అందించారన్నారు. ఆయన ఆదేశాల మేరకు దాడి చేయగా గంజాయితో పాటు నిందితులు పట్టుబడినట్టు ఎస్ఐ చెప్పారు. ఈ మేరకు కేసు నమోదు చేసి, ముగ్గుర్నీ అరెస్టు చేశామన్నారు.

ప్రాథమిక స్థాయి నుంచే యోగా

▸▸ ఆ దిశగా విద్యార్థులను ఉపాధ్యాయులు తీర్చిదిద్దాలి ▸▸ అవగాహన సదస్సులో డీఈవో అప్పారావునాయుడు



మాట్లాడుతున్న డీఈవో అప్పారావునాయుడు



ఆసనాలు వేస్తున్న వివిధ పాఠశాలల విద్యార్థులు

అనకాపల్లి టౌన్, జూన్ 13 (ఆంధ్రజ్యోతి) : ప్రాథమిక స్థాయి నుంచే విద్యార్థులకు యోగా నేర్పించాలని జిల్లా విద్యాశాఖాధికారి గిడ్డి అప్పారావునాయుడు అన్నారు. ఇక్కడి రాజీవ్‌గాంధీ ఇండోర్ స్టేడియంలో శుక్రవారం యోగాసనాల కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి విద్యార్థి యోగా చేయడం వల్ల చక్కనైనా ఆరోగ్యం, మానసిక ప్రశాంతత కలుగుతుందన్నారు. జిల్లా ఆయుష్ అధికారిణి డాక్టర్ కె.లావణ్య మాట్లాడుతూ ప్రతి రోజూ యోగా చేస్తే ఒత్తిడి నుంచి ఉపశమనం లభిస్తుందన్నారు. ఈ నెల 21న విశాఖలో జరగనున్న అంతర్జాతీయ యోగా దినోత్సవానికి అందరూ సమాయత్తం కావాలని పిలుపునిచ్చారు. అనంతరం 800 మంది విద్యార్థులతో కలిసి అంతా కలిసి ఆసనాలు వేశారు. డిప్యూటీ డీఈవో అప్పారావు, యోగా గురువు దొరమ్మనాయుడు, స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ జిల్లా కార్యదర్శి మోటూరు నాగేశ్వరరావు, వ్యాయామ ఉపాధ్యాయ సంఘం కార్యదర్శి కేఎం నాయుడు, వ్యాయామ ఉపాధ్యాయులు పి.కమల, డీవీఎస్‌కే నాయుడు తదితరులు పాల్గొన్నారు. అలాగే, పట్టణంలోని దేమునిగుమ్మం వేంకటేశ్వర స్వామి ఆలయంలో దేవదాయశాఖ ఆధ్వర్యంలో యోగా కార్యక్రమాన్ని నిర్వహించారు. యోగా గురువు బి.రోహిణి ఆధ్వర్యంలో దేవస్థానం సిబ్బంది, కార్యనిర్వాహక అధికారి, మాజీ చైర్మన్, ట్రస్ట్‌బోర్డు మాజీ సభ్యులు యోగాసనాలు వేశారు. రోజూ యోగాసనాలు వేయడం వల్ల ఆనందంగా ఉండవచ్చునని రోహిణి తెలిపారు. ఇదిలావుంటే, కోట్నివీధి మరిడిమాంబ ఆలయ ప్రాంగణంలో అబ్దుల్‌కలాం సేవా సంఘం వ్యవస్థాపకులు ఆళ్ల ప్రవీణ్‌కుమార్, ఎన్.చిరంజీవి ఆధ్వర్యంలో యోగా గురువు బొద్దపు అప్పారావును సత్కరించారు. యోగాసనాలు వేసిన చిన్నారులకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో సంఘ ప్రతినిధులు పాల్గొన్నారు.

మేలైన విత్తనాలతో అధిక దిగుబడులు

▸▸ ఆర్ఏఆర్ఎస్ ఏడీఆర్ డాక్టర్ ముకుందరావు



విత్తన కిట్లు అందుకున్న రైతులతో ఏడీఆర్ ముకుందరావు, తదితరులు

అనకాపల్లి అగ్రికల్చర్, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): అధిక దిగుబడుల సాధనకు విత్తనాల ఎంపికే కీలకమని అనకాపల్లి ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా స్థానం ఏడీఆర్ డాక్టర్ సిహెచ్.ముకుందరావు తెలిపారు. పరిశోధనా స్థానంలో శుక్రవారం నిర్వహించిన ఖరీఫ్ విత్తన దినోత్సవ సమావేశంలో ఆయన మాట్లాడారు. అధిక దిగుబడి విత్తనాల ప్రాముఖ్యత, విత్తనశుద్ధి ప్రాధాన్యతను రైతులు తెలుసుకోవాలన్నారు. విత్తన ఎంపికలో మెలకువలను వివరించారు. చెరకు ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ డి.ఆదిలక్ష్మి మాట్లాడుతూ కొత్త విత్తనాలను ఎంపిక చేయడంలో జాగ్రత్తలను పాటించాలన్నారు. ఆర్‌జీఎల్ 2538 రకానికి ప్రత్యామ్నాయ రకాలను సూచించారు. సన్నబియ్యం రకాలను ప్రభుత్వం ప్రోత్సహిస్తుందని, జిల్లాలో వరి పండించే పరిస్థితులకు అనువైన వంగడాలను ఎంపిక చేసుకోవాలని చెప్పారు. సేద్య విభాగం ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ కె.వి. రమణమూర్తి మాట్లాడుతూ వరిసాగులో అధునిక పద్ధతులు, కలుపు యాజమాన్యం తదితరాలను వివరించారు. డాక్టర్ పి.వి.పద్మావతి విత్తన ఉత్పత్తి మెళకువలను తెలియజేశారు. డాక్టర్ సిహెచ్.రామలక్ష్మి జీవన ఎరువుల ఉపయోగాలను, డాక్టర్ బి.భవానీ వరిసాగులో చేపట్టవలసిన ముందస్తు సస్య రక్షణ పద్ధతులను తెలిపారు. అనంతరం మూలపేట, వాద్రాపల్లి, హరిపాలెం, తిమ్మరాజుపేట, తుమ్మపాల, వెంకుపాలెం, గ్రామాలకు చెందిన నలభై మంది రైతులకు, వరి, కంది విత్తనాలు, జీవన ఎరువుల కిట్లను అందజేశారు. ఈకార్యక్రమానికి సమన్వయ కర్తగా డాక్టర్ ఉమామహేశ్వరరావు వ్యవహరించారు.

'కాన్వెంట్లకు దీటుగా అంగన్‌వాడీ కేంద్రాల్లో విద్యా బోధన'

▸▸ మహిళా, శిశు సంక్షేమ శాఖ ప్రాజెక్టు డైరెక్టర్ సూర్యలక్ష్మి



బయ్యవరం కేంద్రంలో రికార్డులను పరిశీలిస్తున్న పీడీ సూర్యలక్ష్మి

కశింకోట, జూన్ 13 (ఆంధ్రజ్యోతి) : నర్సరీ, కాన్వెంట్‌లకు ధీటుగా అంగన్‌వాడీ కేంద్రాల్లో విద్యాబోధన సాగించాలని మహిళా, శిశు సంక్షేమ శాఖ ప్రాజెక్టు డైరెక్టర్ ఎన్.సూర్యలక్ష్మి సూచించారు. మండలంలోని చింతలపాలెం, నర్సింగబిల్లి, జె.తుని, అచ్చెర్ల అంగన్‌వాడీ కేంద్రాలను శుక్రవారం ఆమె సందర్శించారు. ఆయా కేంద్రాల్లో సరకుల నిల్వలు, రికార్డులను తనిఖీ చేశారు. అనంతరం ఆయా సిబ్బందితో సమావేశమయ్యారు. గర్భిణులు, బాలింతలకు ఇచ్చే పోషకాహారాల వివరాలను అడిగి తెలుసుకున్నారు. పౌష్టికాహారం పట్ల గర్భిణులకు ఎప్పటికప్పుడు అవగాహన కల్పించాలని తెలిపారు. పుట్టబోయే శిశువు రెండున్నర నుంచి మూడు కేజీల బరువుతో ఉండేలా పోషకాహారాన్ని అందించేలా కార్యకర్తలు చర్యలు తీసుకోవాలన్నారు. మూడేళ్లు దాటిన చిన్నారులను అంగన్‌వాడీ కేంద్రాలకు పంపించే విధంగా గ్రామాల్లో ప్రచారం చేయాలన్నారు. తల్లిదండ్రులు కూడా తమ పిల్లలకు అంగన్‌వాడీ కేంద్రాల్లో చేర్పించాలని కోరారు. అనంతరం అచ్చెర్ల అంగన్‌వాడీ కేంద్రంలో ఐదేళ్లు పూర్తయిన పిల్లలకు తల్లులతో సర్టిఫికెట్లు అందజేశారు. ఈ కార్యక్రమంలో బయ్యవరం సూపర్‌వైజర్ వంశీప్రియతో పాటు అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

అనకాపల్లిలో గౌరీ కల్యాణ మండపం

నిర్మాణం చేపట్టాలని అధికారులకు వినతి : గవర కార్పొరేషన్ చైర్మన్ సురేంద్ర



సమావేశంలో మాట్లాడుతున్న మళ్ల సురేంద్ర

తుమ్మపాల, జూన్ 13 (ఆంధ్రజ్యోతి) : గవర కార్పొరేషన్ ద్వారా అర్హులైన వారందరికీ పలు పథకాలు అందజేసేందుకు చర్యలు చేపడుతున్నట్టు కార్పొరేషన్ చైర్మన్ మళ్ల సురేంద్ర తెలిపారు. శుక్రవారం విజయవాడలోని గొల్లపూడి బీసీ భవనంలో జరిగిన గవర కార్పొరేషన్ బోర్డు సమావేశం వివరాలను ఇక్కడి విలేకరులకు ఫోన్ ద్వారా ఆయన వివరించారు. గవర కులస్థులు అత్యధికంగా అనకాపల్లి ప్రాంతంలో ఉండడంతో ఈ ప్రాంతంలో గౌరీ కల్యాణ మండపం నిర్మించాలని ఉన్నధికారులను కోరామన్నారు. అలాగే బీసీ కార్పొరేషన్ ద్వారా అమలు చేస్తున్న పథకాలు, పెన్షన్లు, రుణాలు లబ్ధిదారులకు అందజేసేందుకు అధికార యంత్రాంగం చిత్తశుద్ధితో పనిచేయాలని సూచించినట్టు చెప్పారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పడిన దగ్గర నుంచి అభివృద్ధి, సంక్షేమానికి పెద్దపీట వేస్తూ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు పాలన సాగిస్తున్నారన్నారు. రాష్ట్ర బీసీ కమిషన్ ఈడీ ఉమాదేవి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ సమావేశంలో అధికారులు రఘు, కార్పొరేషన్ డైరెక్టర్లు వేగి పరమేష్, పొలమరశెట్టి నాగేశ్వరరావు, భీమరశెట్టి శ్రీనివాసరావు, బొడ్డేడ శ్రీనివాసరావు, మళ్ల గణేష్, ఆళ్ల మంగరాజు, విల్లూరి హరి, మళ్ల రవికుమార్, బొడ్డేడ గంగాధర్ తదితరులు పాల్గొన్నారని ఆయన వివరించారు.

అంగన్‌వాడీ వర్కర్ల పిల్లలకు 'తల్లికి వందనం' అమలు చేయాలి

▸▸ అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శుల డిమాండ్



మాట్లాడుతున్న అధ్యక్ష, కార్యదర్శులు దుర్గారాణి, నాగేషు

అనకాపల్లి టౌన్, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): అంగన్‌వాడీ వర్కర్ల పిల్లలకు తల్లి వందనం, సంక్షేమ పథకాలు అమలు చేయాలని ప్రభుత్వాన్ని అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎం.దుర్గారాణి, ఎం. నాగేషు డిమాండ్ చేశారు. రేషన్ కార్డులు ఇవ్వాలని కోరుతూ ఈ నెల 16న కలెక్టరేట్ వద్ద జరిగే ధర్నాను అంగన్‌వాడీ కార్యకర్తలు విజయవంతం చేయాలని కోరారు. శుక్రవారం ఇక్కడ జరిగిన సమావేశంలో మాట్లాడారు. రాష్ట్రంలో అంగన్‌వాడీలందరూ పేద కుటుంబాలకు చెందినవారన్నారు. రూ.12వేలలోపు ఆదాయం ఉన్న వారందరికీ సంక్షేమ పథకాలు అమలు చేస్తామని ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. కానీ అంగన్‌వాడీ వర్కర్లకు రూ.11,500 లు, హెల్పర్స్, మినీ వర్కర్లకు రూ.7 వేలు గౌరవ వేతనం మాత్రమే ఇస్తున్నారన్నారు.

నేడు పలు గ్రామాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం

కశింకోట, జూన్ 13 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని తాళ్లపాలెం, నర్సింగబిల్లి సబ్ స్టేషన్‌ల పరిధిలో అడిషనల్ బ్రేకర్ స్కీం పనుల కారణంగా శనివారం పలు గ్రామాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడనుందని ఏపీఈపీడీసీఎల్ ఈఈ ఎస్.రామకృష్ణ తెలిపారు. ఉదయం పది గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటలకు నర్సింగబిల్లి, జె.తుని, ఎస్.జి.పాలెం, త్రిపురవానిపాలెం, అచ్యుతాపురం, చింతలపాలెం, గొబ్బూరు, తాళ్లపాలెం, బంగారయ్యపేట, ఉగ్గినపాలెం, పరవాడపాలెం, జమాదులపాలెం, కొత్తపల్లి, బుచ్చెయ్యపేట, పేరంటాలపాలెం, గంటవానిపాలెం, ఏఎస్ పేట, గొబ్బూరుపాలెం, నరసాపురం, సోమవరం, ఏనుగుతుని, చిన ఏనుగుతుని, జి.భీమవరం, సింగవరం, అచ్చెర్ల, కొత్త అచ్చెర్ల, మోసయ్యపేట, గోకువానిపాలెం గ్రామాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందన్నారు. కాగా ఆయా గ్రామాల పరిధిలో వ్యవసాయ విద్యుత్ కనెక్షన్ వినియోగదారులకు విద్యుత్ వేళల్లో మార్పులు జరిగాయన్నారు. ఉదయం ఎనిమిది నుంచి 10 గంటల వరకు, మధ్యాహ్నం ఒంటి గంట నుంచి సాయంత్రం ఆరు గంటల వరకు విద్యుత్ సరఫరా అవుతుందని వివరించారు. వినియోగదారులంతా సహకరించాల్సిందిగా కోరారు.

మేయర్‌ను సత్కరించిన రత్నాకర్



మేయర్‌కు జ్ఞాపిక అందిస్తున్న రత్నాకర్

అనకాపల్లి టౌన్, జూన్ 13 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ మేయర్‌గా ఎన్నికైన పీలా శ్రీనివాసరావును టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి దాడి రత్నాకర్ శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిశారు. విశాఖలోని ఆయన చాంబర్‌లో సత్కరించి జ్ఞాపికను అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.

పోస్టాఫీస్ భవన నిర్మాణానికి స్థలం కోరుతూ వినతి

సబ్బవరం, జూన్ 13 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రం సబ్బవరంలో పోస్టాఫీస్ భవన నిర్మాణానికి స్థలం కేటాయించాలని కోరుతూ ఆ శాఖ సబ్ డివిజన్ ఇన్‌స్పెక్టర్ ఉమామహేశ్వరరావు, సబ్ పోస్టుమాస్టర్ వెంకటరమణ, డీఎస్ఆర్ ప్రసాద్ తదితరులు తహసీల్దార్ బి.చిన్నికృష్ణకు శుక్రవారం వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గతంలో సబ్బవరం సర్వే నంబరు 359/6లో ఇరవై సెంట్ల స్థలాన్ని కేటాయించారన్నారు. సదరు స్థలాన్ని తమకు అప్పగించకుండానే వేరొక విభాగానికి కేటాయించారని వివరించారు. పోస్టాఫీస్‌కు పక్కా భవనం లేకపోవడంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని చెప్పారు. పక్కా భవన నిర్మాణానికి ఇరవై సెంట్ల స్థలాన్ని కేటాయించాలని విన్నవించారు. ఈ కార్యక్రమంలో పైలా రాజేశ్, కోటేశ్వరరావు, పైడినాయుడు, నరశింగరావు తదితరులు పాల్గొన్నారు.

పంట కాలువల్లో పూడికతీత

తుమ్మపాల, జూన్ 13 (ఆంధ్రజ్యోతి) : ఇక్కడి పంట కాలువల్లో పూడికతీత పనులు శుక్రవారం ప్రారంభమయ్యాయి. టీడీపీ మండల అధ్యక్షుడు కర్రి బాబి ప్రారంభించి మాట్లాడారు. నియోజకవర్గంలో నీటి సంఘాలకు ప్రభుత్వం రూ.2.28 కోట్లు మంజూరు చేసిందన్నారు. ఇందులో భాగంగా తుమ్మపాల చానల్‌కు పది లక్షలు మంజూరు కావడంతో పనులకు శ్రీకారం చుట్టామన్నారు. ఈ కార్యక్రమంలో నీటి సంఘం చైర్మన్ పీలా సీతారాం, ఆడారి గోవిందరావు, పీలా తాతునాయుడు, పెతకంశెట్టి బలరాం, వియ్యపు సింహాచలం, కొణతాల రమణబాబు తదితరులు పాల్గొన్నారు.

వివాహిత అదృశ్యంపై కేసు

అనకాపల్లి టౌన్, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): పట్టణ పోలీస్‌స్టేషన్ పరిధిలోని కృష్ణాపురం కాలనీకి చెందిన వివాహిత అదృశ్యమైన సంఘటనపై శుక్రవారం అందిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పట్టణ ఎస్ఐ డి. ఈశ్వరరావు తెలిపారు. ఫిర్యాది దాసరి సలోమి కుమార్తె ఝాన్సీ చాలా కాలం నుంచి తల్లి వద్దే పిల్లలతో ఉంటోంది. శుక్రవారం వేకువజామున ఇంట్లో ఎవరికీ చెప్పకుండా బయటకు వెళ్లిపోయింది. దీంతో ఎక్కడ వెతికినా ఆమె ఆచూకీ లభించకపోవడంతో తల్లి సలోమి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ ఈశ్వరరావు తెలిపారు.

యువకుడిపై కేసు నమోదు

అనకాపల్లి టౌన్, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): పట్టణ పోలీస్‌స్టేషన్ పరిధిలోని కొత్తూరులో గురువారం రాత్రి ఒక వివాహిత పట్ల అసభ్యంగా ప్రవర్తించిన యువకునిపై శుక్రవారం అందిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పట్టణ ఎస్ఐ అల్లు వెంకటేశ్వరరావు తెలిపారు. వివాహిత శైలజా గురువారం రాత్రి ఇంట్లో నిద్రిస్తుండగా ఆ పక్కవీధికి చెందిన రాజేశ్ అనే యువకుడు ఇంట్లోకి వచ్చి ఆమె పట్ల అసభ్యంగా ప్రవర్తించినట్టు శుక్రవారం బాధితురాలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ తెలిపారు.

'కంటింజెంట్ వర్కర్ల సమస్యలు పరిష్కరించండి'

అనకాపల్లి టౌన్, జూన్ 13 (ఆంధ్రజ్యోతి) : వైద్య ఆరోగ్య శాఖలో పనిచేస్తున్న కంటింజెంట్ వర్కర్ల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఎన్‌హెచ్‌ఎం జేఏసీ ఆధ్వర్యంలో డీఎం హెచ్‌వో బాలాజీకి శుక్రవారం వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా జేఏసీ ప్రతినిధులు జగదీష్, రామకృష్ణ, పెంటయ్య, శేషులక్ష్మి మాట్లాడుతూ ఎన్‌హెచ్‌ఎంలో కంటింజెంట్ వర్కర్లను రెగ్యులర్ చేయడంతో పాటు పెండింగ్ సమస్యలు పరిష్కరించాలని కోరారు. కార్మికులకు కనీస వేతనం రూ.26 వేలు అమలు చేయాలని, పలు పీహెచ్‌సీల్లో షిఫ్ట్ డ్యూటీలు పాటించకుండా ఆడవారిని, మగవారిని నైట్‌షిఫ్ట్ డ్యూటీలోనే ఉంచుతున్నారని వివరించారు. ఇతర ఉద్యోగుల వలే షిఫ్ట్ డ్యూటీ విధానం అమలు చేయాలన్నారు. ఎనిమిది గంటల పనివేళలు కల్పించి జాబ్‌చార్ట్ ఇవ్వాలని విన్నవించారు.

రాయితీపై పశుదాణా పంపిణీ

సబ్బవరం, జూన్ 13 (ఆంధ్రజ్యోతి) : పాడి సంపద పరిరక్షణకు ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారిస్తున్నట్టు పశు సంవర్థక శాఖ సహాయకులు డాక్టర్ స్వర్ణలత, సర్పంచ్ మామిడి శంకరరావు తెలిపారు. యాభై శాతం రాయితీపై ప్రభుత్వం సమకూర్చిన పశుదాణాను శుక్రవారం మండలంలోని నారపాడులో రైతులకు పంపిణీ చేసి మాట్లాడారు. పాడి సంపదను వృద్ధి చేసిఆర్థికంగా బలోపేతం కావాలని రైతులకు వారు సూచించారు.

ఎమ్మెల్యే 'పంచకర్ల' పేరిట విస్తృతంగా సేవలు

▸▸ అహ్మదాబాద్ విమాన ప్రమాదం నేపథ్యంలో జన్మదిన వేడుకలకు రమేశ్‌బాబు దూరం

▸▸ అనాథాశ్రమాలు, ఆస్పత్రుల్లో నిత్యావసరాలు, పాలు, పండ్లు పంపిణీ చేసిన నేతలు

▸▸ ముత్యాలమ్మపాలెంలో హత్యకు గురైన జనసేన కార్యకర్త కుటుంబానికి ఆర్థిక సాయం



హత్యకు గురైన బంగార్రాజు కుటుంబానికి ఆర్థిక సాయం అందిస్తున్న పంచకర్ల ప్రసాద్



పరవాడ బాలుర హైస్కూల్‌కు సీలింగ్ ఫ్యాన్లు అందజేస్తున్న కూటమి నాయకులు

పరవాడ, జూన్ 13 (ఆంధ్రజ్యోతి) : ఎమ్మెల్యే పంచకర్ల రమేశ్‌బాబు జన్మదినం సందర్భంగా కూటమి నాయకులు పరవాడ మరిడిమాంబ కల్యాణ మండపంలో శుక్రవారం పలు సేవా కార్యక్రమాలు నిర్వహించారు. ఇందులో భాగంగా ఇటీవల ముత్యాలమ్మపాలెంలో హత్యకు గురైన జనసేన కార్యకర్త బంగార్రాజు కుటుంబానికి రూ.6.75 లక్షల ఆర్థిక సాయాన్ని ఆ పార్టీ పరవాడ మండల ఇన్‌చార్జి పంచకర్ల ప్రసాద్ చేతుల మీదుగా అందజేశారు. ఈ మొత్తంలో రెండు లక్షలు ఎమ్మెల్యే పంచకర్ల, మిగతా నగదును కూటమి నాయకులు సమకూర్చారు. అలాగే పరవాడ బాలుర హైస్కూల్‌కు ఐదు సీలింగ్ ఫ్యాన్లు, బాలికల వసతి గృహానికి ఐదు సీలింగ్‌ఫ్యాన్లు అందజేశారు. తొలుత అహ్మదాబాద్‌లో జరిగిన విమాన ప్రమాదంలో మృతి చెందినవారి ఆత్మకు శాంతి చేకూరాలని మౌనం పాటించారు. ఈ కారణంగానే పుట్టినరోజు వేడుకలకు దూరంగా ఉన్నట్టు ప్రకటించారు. ఈ సేవా కార్యక్రమాల్లో మాజీ ఎంపీపీలు పైలా జగన్నాథరావు, మాసవరపు అప్పలనాయుడు, కూటమి నాయకులు బొద్దపు శ్రీనివాసకాసులు, బుగిడి రామగోవిందరావు, కన్నూరు వెంకటరమణ, వియ్యపు చిన్న, చింతకాయల ముత్యాలు, మోటూరు సన్యాసినాయుడు, శిరపురపు అప్పలనాయుడు, కరణం నర్సింగరావు, మడక రమణ, అట్టా సన్యాసిఅప్పారావు, బొడ్డపల్లి అప్పారావు, నగిరెడ్డి చిన్నారావు, చింతకాయల సుజాత, వర్రి పరదేశినాయుడు, మేడిశెట్టి బాలాజీనాయుడు తదితరులు పాల్గొన్నారు.

సబ్బవరం మండలంలో...

సబ్బవరం : ఎమ్మెల్యే పంచకర్ల రమేశ్‌బాబు జన్మదినం సందర్భంగా జనసేన నేతలు శుక్రవారం పలు సేవా కార్య క్రమాలు నిర్వహించారు. గొటివాడలో గల జనరేషన్ యువ అనాథాశ్రమానికి నిత్యావసర సరుకులు, కూరగాయలు, విద్యార్థులకు స్నాక్స్ అందజేశారు. స్థానిక పీహెచ్ సీలో రోగులకు పండ్లు, రొట్టెలు, పాలు పంపిణీ చేశారు. ముందుగా ఆ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఇందలి వెంకటరమణ, మండల కన్వీనర్ కర్రి కనకరాజు మాట్లా డుతూ అహ్మదాబాద్‌లో జరిగిన విమాన ప్రమాదంలో సుమారు 290 మంది మృతిచెందడంతో ఎమ్మెల్యే పంచ కర్ల జన్మదిన వేడుకలను రద్దు చేయడం జరి గిందన్నారు. సేవా కార్యక్రమాల్లో జనసేన నేతలు బలిరెడ్డి అప్పారావు, బైలపూడి దేముడుబాబు, సాలాపు వెం కటేశ్వరరావు, బోకం స్వామినాయుడు, ఉగ్గిన రాము, గొర్లి కుమార్, బంతికోళ్ల పద్మ, గండి దుర్గాప్రసాద్, టి.శేఖర్, కొల్లి కృష్ణ, పల్ల రమణ, జెట్టి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

17నుంచి కనకదుర్గమ్మ ఆలయ వార్షికోత్సం

అనకాపల్లి టౌన్, జూన్ 13 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని గవరపాలెం సతకంపట్టులో గల కనకదుర్గమ్మ ఆలయ అష్టమి వార్షికోత్సవ వేడుకలు ఈనెల 17వ తేదీ నుంచి మూడు రోజులపాటునిర్వహించనున్నామని ఆలయ శాశ్వత చైర్మన్ కాండ్రేగుల నాయుడు, ఆలయ వ్యవస్థాపకులు పీవీ రమణ తెలిపారు. ఇందుకు సంబంధించిన కరపత్రాలను శుక్రవారం విడుదల చేసి మాట్లాడారు. ఈ వేడుకల్లో భాగంగా ప్రతిరోజూ అమ్మవారికి విశేష పూజలు జరుపుతామన్నారు. ఈ కార్యక్రమంలో చైర్మన్ భీమరశెట్టి వరహా నూకరాజు, మురళీకృష్ణ, సంతోష్అప్పారావు, దాడి కృష్ణ, నరసింగరావు, భూలోకనాయుడు, కేఎం నాయుడు పాల్గొన్నారు.

పోలీసుల చొరవతో రహదారి మరమ్మతులు



జీకేవీధి-లంకపాకల మధ్యలో అంతర్రాష్ట్ర రహదారిలో గోతులను గ్రావెల్‌తో పూడ్చుతున్న దృశ్యం

సీలేరు, జూన్ 13 , (ఆంధ్రజ్యోతి) : ఎట్టకేలకు జీకే వీధి లంకపాకల రహదారిలోని పెద్దపెద్ద గోతులను జీకేవీధి పోలీసుల చొరవతో గ్రావెల్ వేసి పూడ్చారు. దీంతో ఈ ప్రాంత ప్రయాణికులు, స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఎన్నో ఏళ్లుగా ఈ రహదారి గోతు లమయం కావడంతో ఈ ప్రాంతీయుల తో పాటు నిత్యం దారాలమ్మ ఆలయానికి దర్శనానికి వివిధ ప్రాంతాల నుంచి వచ్చే భక్తులు, పర్యాటకులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అయినా, ఆర్‌అండ్‌బీ అధికార్లు పట్టించుకోకుండా నిర్లక్ష్యం చేశారు. కనీసం గోతులు పూడ్చే చర్యలు కూడా తీసుకోలేదు. ఈ స్థితి లో చింతపల్లి ఏఎస్పీ నవజ్యోతి మిశ్రా గత నెలలో సీలేరు పర్యటనకు వచ్చిన సమయంలో ఈ రోడ్డు దుస్థిని చూసి ఆశ్చర్య పోయారు. ఆర్‌అండ్‌బీ అధికార్ల తో మాట్లాడినప్పటికీ రోడ్డు పనులు ఇప్పట్లో జరగ వన్న విషయం తెలుసుకుని ఈ ప్రాంత ప్రయాణి కుల ఇబ్బందులను కొంతమేరకు అయినా తొలగించాలని జీకేవీధి లంకపాకల మధ్యలో ఉన్న గోతులను పూడ్చే చర్యలను చేపట్టాలని పోలీసులను ఆదేశించారు. ఈపనులు చేపట్టడంతో పలువురు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

అనుమానితులకు క్షయ నిర్ధారణ పరీక్షలు



జీకేవీధి-లంకపాకల మధ్యలో అంతర్రాష్ట్ర రహదారిలో గోతులను గ్రావెల్‌తో పూడ్చుతున్న దృశ్యం

హుకుంపేట జూన్13 ఆంధ్రజ్యోతి: క్షయ వ్యాధి లక్షణాలున్న ప్రతి ఒక్కరూ వ్యాధి నిర్ధారణ పరీక్షలు చేయించుకోవాలని వైద్యాధికారి రణ ప్రతాప్ తెలిపారు . శుక్రవారం ఉప్ప ఆరోగ్య కేంద్రంలో మండలంలోని మజ్జివలస, అమనగిరి దాబావలస, పనసపుట్టు కుమ్మరిపుట్టు గ్రామాల్లో టీబీ ముక్తభారత్ అభియాన్ కార్యక్రమంపై ఆశ వర్కులకు అవగాహన కల్పించారు. సందర్భంగా ఆయన మాట్లాడుతూ రోజుల తరబడి జ్వరం, దగ్గు, బరువు తగ్గడంఉంటే వైద్య పరీక్షలు తప్పనిసరని అన్నారు. వ్యాధ నిర్ధారణ తర్వాత క్రమం తప్పకుండా మందులు వాడేలా చూడాలన్నారు. (ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది సదానందం తదితరులు పాల్గొన్నారు.

ఎల్లవరం కట్టువీధిలో రోడ్డు నిర్మాణం



భూమి పూజ చేస్తున్న ఎంపీపీ బోయిన కుమారి

గూడెంకొత్తవీధి, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వంచుల పంచాయతీ ఎల్లవరం కట్టువీధి గ్రామానికి రూ.50లక్షల ప్రధానమంత్రి గ్రామీణ యోజన సడక్ నిధులతో తారు రోడ్డు నిర్మిస్తున్నట్టు స్థానిక ఎంపీపీ బోయిన కుమారి అన్నారు. శుక్రవారం ఆమె శంకుస్థాపన చేశారు. ఈసందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ గిరిజన గ్రామాలకు తారు రోడ్లు నిర్మాణానికి ప్రభుత్వం అధిక ప్రాధాన్యం ఇస్తోందన్నారు. ప్రధాన రహదారి నుంచి ఎల్లవర కట్టువీధి వరకు రెండు కిలోమీటర్ల రహదారి నిర్మించడంతో ఆదివాసీలకు రవాణా కష్టాలు తీరుతాయని ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండలాధ్యక్షుడు ముక్కలి మహేశ్, అధికారులు పాల్గొన్నారు.

యువత సన్మార్గంలో నడవాలి: ఎస్ఐ



వాలసీలోమాట్లాడుతున్న ఎస్ఐ శ్రీనివాస్

అనంతగిరి, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): యువత సన్మార్గంలో నడవాలని స్థానిక ఎస్ఐ డి.శ్రీనివాసరావు పిలుపునిచ్చారు. మండలంలోని మారుమూల వాలసీ పంచాయతీ కేంద్రంలో శుక్రవారం గిరిజన యువతతో ఆయన ప్రత్యేక సమావేశమయ్యారు.. గ్రామాల్లో అపరిచిత వ్యక్తుల సమాచారం ఇవ్వాలని ఆదేశించారు. అలాగే అసాంఘిక కార్యకలాపాలకు దూరంగా ఉండాలని, గంజాయి, రవాణా వంటివాటి జోలికి పోవద్దని హితవు పలికారు. ఉద్యోగ అవకాశాలపై దృష్టిపెట్టాలని కోరారు. మాదకద్రవ్యాలకు దూరంగా ఉండా లన్నారు. యువత చక్కటి నడవడికతో కుటుంబానికి, గ్రామానికి ఆదర్శంగా నిలివాలని పిలుపునిచారు. ఈ కార్యక్రమంలోని స్థానికులు పాల్గొన్నారు.

విత్తనాలు పంపిణీ

అనంతగిరి, జూన్ 13 (ఆంధ్రజ్యోతి):మండలంలోని పినకోట పంచాయతీ కేంద్రంలోని శుక్రవారం గిరిజన రైతులకు విత్తనాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ గణేశ్ మాట్లాడుతూ.. వర్షాకాలం ముందుగానే విత్తనాలను అందించడం రైతులకు మేలు జరుగుతుందని భావించారు. ప్రభుత్వం 90శాతం రాయితీపై గిరిజనులకు విత్తనాలను అందిస్తోందని, దీనిని రైతులందరూ సద్వినియోగం చేసుకుని, ఆర్థికంగా ఎదగాలని ఆకాక్షించారు. ఈ కార్యక్రమంలో వాటర్ షెడ్డుఅధ్యక్షుడు కొండబాబు, ఉప సర్పంచ్ మత్స్యరాజు, వార్డు మెంబర్ నాగరాజు, తదితరులు పాల్గొన్నారు.

15వ ఆర్థిక సంఘం నిధులు విడుదల చేయాలి

» పంచాయతీ సర్పంచుల డిమాండ్



సమస్యలపై డీఆర్‌వోకు వినతిపత్రం అందిస్తున్న పంచాయతీ సర్పంచ్‌లు

పాడేరురూరల్, జూన్ 13(ఆంధ్రజ్యోతి): గ్రామాల అభివృద్ధికి ప్రభుత్వం తక్షణమే 15వ ఆర్థిక సంఘం నిధులు విడుదలతోపాటు పలు సమస్యలు పరిష్కరించాలని జిలాలోని 22 మండలాలకు చెందిన సర్పంచులు డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం పాడేరులోని అంబేడ్కర్ కూడలి నుంచి ఐటీడీఏ వరకు శాంతి ర్యాలీని చేపట్టి డీఆర్‌వో పద్మలతకు వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా పలువురు సర్పంచ్‌లు మాట్లాడుతూ గ్రామ పంచాయతీలకు రావాల్సిన 15వ ఆర్థిక సంఘం నిధులను ప్రభుత్వం విడుదల చేయకుండా గత వైసీపీ ప్రభుత్వం తరహాలోనే కూటమి ప్రభుత్వం వ్యవహరించడం దుర్మార్గమని అన్నారు. 14వ ఆర్థిక సంఘం నిధులను వైసీపీ ప్రభుత్వం పక్కదారి పట్టించి గ్రామ పంచాయతీలను నిర్వీర్యం చే సిందన్నారు. నేడు 15వ ఆర్థిక సంఘం నిధులను కూటమి ప్రభుత్వం అందించకుండా ఇదే విధంగా వ్యహరించడం అన్యాయమన్నారు. 15వ ఆర్థిక సంఘం నిధులు విడుదల చేయాలని, 1/70 చట్టం అమలు చేయాలని, జీవో నెంబర్ 3 పునరుద్దరణకు చర్యలు చేపట్టాలని, ఉపాధి మెటీరియల్ పేమెంట్స్ గ్రామ పంచాయతీలకు జమ చేయాలని, తల్లికి వందనం నిధులు సర్పంచ్ కుటుంబాలకు వర్తింపచేయాలని, పారిశుధ్య కార్మికుల జీతాలు ప్రభుత్వమే చెల్లించాలని డిమాండ్ చేశారు. . ఈ కార్యక్రమంలో వివిధ పంచాయతీల సర్పంచ్‌లు సీదరి రాంబాబు, కుందిరి రామకృష్ణ, పాగి అప్పారావు, తురియా పుష్పలత, సమిడ వెంకట పూర్ణిమ, ముసలినాయుడు, వనుగు బసవన్నదొర, రేగం రమేశ్, పాంగి సునీత, సురభంగా రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయం లాభదాయకం



సబల ప్రాజెక్టుపై సమీక్షిస్తున్న విదేశీ ప్రతినిధి ఎలినార్ బజరన్ తాంక్

పాడేరురూరల్, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): ప్రకృతి వ్యవసాయంతో రైతులకు ఆర్థికంగా లాభాలతోపాటు ప్రజల ఆరోగ్యాలు మెరుగుపడతాయని ఎన్ఈపీ, ఐ యాసీఎస్, జీఈఎఫ్ సంస్థకు చెందిన విదేశీ ప్రతినిధి ఎలినార్ బజరన్ తాంక్ అన్నారు. మండలంలో డి.గొందూరు పంచాయతీలో మైక్రో ల్యాండ్ స్కేప్‌లో జరుగుతున్న ప్రాజెక్టును ఆయన శుక్రవారం సందర్శించారు. ఈ సందర్భంగా ప్రకృతి వ్యవసాయం, జీవ వైవిధ్యం ఎంటర్‌ప్రైజెస్ లబ్ధిదారులతో చర్చించి జరుగుతున్న కార్యక్రమాలు, అభివృద్ధి పనులను అడిగితెలుసుకున్నారు. అనంతరం ఫీల్డులో జరుగుతున్న పనులను పరిశీలించి రైతులను, సబల్ ప్రాజెక్టు సిబ్బంది పనితీరుపై హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో వాసన్ సంస్థ ప్రతినిధి డాక్టర్.సన్నీ, రెయిన్ ఫారెస్టు అలయెన్స్ సంస్థ ప్రతినిధులు వినూత్న, సౌమిత్రి, ఎఫ్ఈఎస్ సంస్థ ప్రతినిధి వలీ, వివిధ ఎన్‌జీవోల ప్రతినిధులు, ఆర్‌వైఎస్ఎస్ ప్రతినిధులు భాస్కర్ పాల్గొన్నారు.

గిరిజన హక్కులను పరిరక్షించాలి

» ఏబీఎస్‌పీ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే రాజారావు



జేఏసీ చేపట్టిన రిలే నిరాహార దీక్షలకు మద్దతు తెలుపుతున్న రాజారావు

పాడేరురూరల్, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): గిరిజన ప్రాంత హక్కులు, చట్టాలు పరిరక్షణకు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు కృషి చేయాలని ఆల్ ఇండియా బహుజన సమాజ్ పార్టీ (ఏఐబీఎస్‌పీ) జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే లకే రాజారావు డిమాండ్ చేశారు. షెడ్యూల్ ఏరియా ఉద్యోగాల నియామక చట్టం సాధించేందుకు ఐటీడీఏ వద్ద 31 రోజులుగా ఆదివాసీ జేఏసీ చేపట్టిన రిలే నిరాహార దీక్ష శిబిరాన్ని శుక్రవారం సందర్శించిన ఆయన వారికి సంపూర్ణ మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆదివాసీ నిరుద్యోగులకు ఆయువుపట్టయిన జీవో 3 రద్దు చేయడం దుర్మార్గమన్నారు. గతంలో ఆ జీవోతో ఎంతో మంది గిరిజనులు ఉపాధ్యాయులుగా చేరి విధులు నిర్వహిస్తున్నారన్నారు. ప్రభుత్వం తక్షణమే స్పందించి జీవో 3 స్థానంలో మరో జీవోను తీసుకువచ్చి గిరిజన నిరుద్యోగ యువతకు న్యాయం చేయాలని ఆయన డిమాండ్ చేశారు. అలాగే, వివిధ పంచాయతీల సర్పంచ్‌లు మద్దతు తెలిపారు. ఈ కార్యక్రమంలో బీఎస్‌పీ మం డల, జిల్లా నాయకులు, జేఏసీ నాయకులు పాల్గొన్నారు.

గిరిజన రైతులతో ఉద్యాన పంటల సాగు

» ఎన్ఆర్ఈజీఎస్ ఏపీడీ లాలం సీతయ్య



సమావేశంలో మాట్లాడుతున్న ఏపీవో సీతయ్య

చింతపల్లి, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా గిరిజన రైతులతో ఉద్యాన పంటల సాగును ప్రోత్సహిస్తున్నట్టు అసిస్టెంట్ ప్రాజెక్టు డైరెక్టర్ (ఏపీడీ) లాలం సీతయ్య అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో జీకేవీధి, చింతపల్లి మండలాల ఉపాధి హామీ పథకం అధికారులు, క్షేత్ర స్థాయి ఉద్యోగుల ఉద్యాన పంటల సాగుపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఏపీడీ మాట్లాడుతూ గిరిజన ప్రాంతంలో గంజాయికి ప్రత్యామ్నంగా ఉద్యాన పంట సాగును ప్రభుత్వం ప్రోత్సహిస్తోందన్నారు. ప్రధానంగా గిరిజన రైతులకు సిల్వర్ ఓక్, అవకాడో, డ్రాగన్‌ఫ్రూట్, జీడిమామిడి, మామిడి, మిరియాలు, సపోట, సీతాఫలం మొక్కలు ఉచితంగా అందజేస్తున్నట్టు వివరించారు. రైతులకు మూడేళ్లపాటు సాగు ప్రోత్సాహాలను అందజేస్తామన్నారు. 2025-26 వార్షిక సంవత్సరంలో చింతపల్లి మండలంలో మూడు వేల మంది రైతులతో 2036 ఎకరాలు, జీకేవీధిలో మూడు వేలమంది రైతులతో 2500 ఎకరాల్లో ఉద్యాన పంట సాగుకి ప్రణాళిక సిద్ధం చేశామన్నారు. రైతులకు జూలైలో మొక్కలు అందజేస్తామన్నారు. రైతులు ఉద్యాన పంట సాగుపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. ఈకార్యక్రమంలో ఏపీవోలు రాజు, రాంప్రసాద్ పాల్గొన్నారు.

ఏవోకు ఘన సన్మానం



బదిలీపై వెళ్తున్న ఏవో, బాధ్యతలు చేపట్టిన ఎంపీడీవో, ఏవోలను సన్మానిస్తున్న కార్యాలయ సిబ్బంది, సచివాలయ కార్యదర్శులు

పాడేరురూరల్, జూన్ 13(ఆంధ్రజ్యోతి): పాడేరు ఎంపీడీవో కార్యాలయ పరిపాలనాధికారి ఎ.మహేశ్వరరావు గొలుగొండ మండలానికి బదిలీపై వెళ్తుండటంతో కార్యాలయ సిబ్బంది, గ్రామ సచివాలయ కార్యదర్శులు శుక్రవారం అతన్ని ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా సభలో పలువురు వక్తలు ఆయన సేవలను కొనియాడారు. అలాగే, ఆయన స్థానంలో డుంబ్రిగుడ మండలం నుంచి బదిలీపై వచ్చి ఏవోగా బాధ్యతలను స్వీకరించిన పీఆర్‌సీ.వేణుగోపాల్‌కు, ఇటీవల పూర్తి స్థాయి ఎంపీడీవోగా శుక్రవారం బాధ్యతలు స్వీకరించిన జే.తేజరతన్‌లకు పుష్పగుచ్ఛాలందించి అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో కార్యాలయ సిబ్బంది, సచివాలయ కార్యదర్శులు పాల్గొన్నారు.

వసతి గృహాల్లో దోమల మందు పిచికారీ



లోతుగెడ్డ ఆశ్రమ పాఠశాలలో దోమల మందు పిచికారి చేస్తున్న వైద్య సిబ్బంది

చింతపల్లి, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): గిరిజన సంక్షేమశాఖ పాఠశాల, వసతి గృహాల్లో దోమల మందు పిచికారీ చేస్తున్నామని కోరుకొండ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి శివ కుమార్ తెలిపారు. శుక్రవారం మండలంలోని లోతుగెడ్డ బాలుర ఆశ్రమ పాఠశాలలో దోమల మందు పిచికారీని పరిశీలించారు. ఈసందర్భంగా వైద్యాధికారి మాట్లాడుతూ మలేరియా కేసులు నమోదైన గిరిజన గ్రామాల్లో ఈ పిచికారీ జరుగుతుందన్నారు. ప్రస్తుతం పాఠశాలలు పునఃప్రారంభం కావడంతో ఆశ్రమ పాఠశాలలు, వసతి గృహాలను ఏసీఎం 5శాతం మందు పిచికారీ చేస్తున్నామన్నారు. అలాగే పాఠశాలలో చేరిన విద్యార్థులకు ఆరోగ్య తనిఖీ చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో మలేరియా సబ్ యూనిట్ అధికారి బుక్కా చిట్టిబాబు, ఎంటీఎస్ గుమ్మ యుగంధర్, ప్రధానోపాధ్యాయులు ఎస్‌వీ రమణ పాల్గొన్నారు.

సొలబొంగు రోడ్డు ప్రతిపాదనలకు కలెక్టర్ ఆదేశం

అనంతగిరి, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పినకోట పంచాయతీ సొలబొంగు గ్రామానికి చెందిన విద్యార్థులు రైవాడ జలాశయంలో నాటుపడవపై ప్రయాణం చేస్తుండడంపై రాష్ట్ర ఎస్టీకమిషన్ ఆదేశాల మేరకు కలెక్టర్ నివేదికను కోరారు.. ఈ గ్రామానికి చెందిన 12 మంది విద్యార్థులు అనకాపల్లి జిల్లా దేవరాపల్లి మండలం తామరబ్బ ఎంపీపీ పాఠశాలలో విద్యాభ్యాసం చేస్తున్నారు. అయితే, ఈ గ్రామానికి రహదారి సౌకర్యం లేకపోవడంపై పత్రికల్లో కథనాలను ప్రచురించింది.. దీనిపై ఎస్టీకమిషన్ ఆదేశాలపై నివేదికను కోరారు. బోడుగరువు మీదుగా వీరభద్రపేటను కలుపుతూ సొలబొంగు గ్రామానికి 2 కిలో మీటర్ల రోడ్డు నిర్మాణానికి ప్రతిపాదనలు పంపించాలని, టీడబ్ల్యూ ఈఈ వేణుగోపాలరావుకు కలెక్టర్ దినేశ్‌కుమార్‌ను ఆదేశించారు.

రేషన్ సరకుల ఇబ్బందులపైనా..

రొంపల్లి పంచాయతీ బూరిగ, చినకోనేల గ్రామాల గిరిజనులు అటవీ మార్గంలో రేషన్ సరకులు తరలింపుపైనా ఎస్టీకమిషన్ నివేదికను కోరింది.. దీనిపై సివిల్‌సప్లై అధికారులకు నివేదిక ఇవ్వాలని ఆదేశించింది.

మెడికల్ కళాశాలలో రక్తదాన శిబిరం



రక్తదానం చేస్తున్న విద్యార్థులతో డీఎంహెచ్‌వో, వైద్య సిబ్బంది

పాడేరురూరల్, జూన్ 13(ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రభుత్వ మెడికల్ కళాశాలలో రెడ్ క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో శుక్రవారం ఏర్పాటుచేసిన రక్తదాన శిబి రాన్ని డీఎంహెచ్‌వో షేక్ జమీల్ బాషా, కళాశాల ప్రిన్సిపాల్ హేమలత ప్రారంభించారు. రక్తదానం వల్ల కలిగే ప్రయోజనాలను వారు విద్యార్థులకు వివరించారు. ప్రపంచ రక్తదాతల దినోత్సవాన్ని పురస్కరించుకుని నిర్వహించిన ఈ శిబిరంలో ఎంబీబీఎస్ విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని రక్తదానం చేశారు. కార్యక్రమంలో డాక్టర్. రాఘవేంద్ర, సొసైటీ వైస్ చైర్మన్ గంగరాజు, కార్యదర్శి గౌరీశంకరరావు తదితరులు పాల్గొన్నారు.

విమాన ప్రమాదంలో మృతులకు నివాళి

సీలేరు,, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): జీకేవీధి మండలం సీలేరులో శుక్రవారం మార్కెట్ సెంటర్‌లో అహ్మదాబాద్ విమాన ప్రమాదంలో మృతులకు ఆత్మశాంతి చేకూరాలని స్థానికులు రెండు నిమిషాల పాటు మౌనం పాటించి నివాళులు అర్పించారు. కాంగ్రెస్ కమిటీ జిల్లా అధ్యక్షుడు కారే శ్రీనివాస్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి గ్రామానికి యువత, వర్తక సంఘం సభ్యులు పలువురు పాల్గొని సంతాపం తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆదివాసీ సంఘం జిల్లా అధ్యక్షుడు మనోజ్, బీజేపీ కార్యకర్త మారిబాబు, వర్తక సంఘం సభ్యులు వానపల్లి అప్పారావు, మూర్తి, వీరబాబు, జెన్‌కో కాంట్రాక్టు కార్మికులు అప్పలరాజు, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

'దేశ ప్రగతికి ప్రధాని మోదీ కృషి'



మొక్కలు నాటుతున్న బీజేపీ నాయకులు

గూడెంకొత్తవీధి, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): దేశ ప్రగతికి ప్రధాని నరేంద్ర మోదీ ఎంత గానో కృషి చేస్తున్నారని రాష్ట్ర ట్రైకార్ డైరెక్టర్ కూడా కృష్ణారావు, బీజేపీ గిరిజన మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు కురుస ఉమామహేశ్వరరావు అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో బీజేపీ కేంద్రంలో 11ఏళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా ఆ పార్టీ నాయకులు మొక్కలు నాటారు. కార్యకర్తలు స్వీట్లు పంచారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం గిరిజనుల అభివృద్ధికి పెద్దపీట వేసిందన్నారు. శివారు గ్రామాలకు రహదారులు, పక్కా గృహాలు, పలు రకాల పథకాలను మంజూరు చేసిందన్నారు. ఈ కార్యక్రమంలో పాడేరు మార్కెట్ యార్డు చైర్మన్ మచ్చల మంగతల్లి, ఎంపీటీసీ సభ్యురాలు రీమల రాజేశ్వరి, పార్టీ మండలాధ్యక్షుడు కాకూరు శేఖర్, పార్టీ నాయకులు బొండ్ల చిరంజీవి, రామ్ కిరణ్ కుమార్, లక్ష్మణ్, మోదీ, మోహన్, వెంకటరమణ, సతీశ్ పాల్గొన్నారు.

కళ్యాణగుమ్మి రోడ్డు నిర్మాణానికి అటవీశాఖ అనుమతులు జారీ

» 'ఆంధ్రజ్యోతి' ఎఫెక్ట్



కలెక్టర్‌కు ధన్యవాదాలు తెలుపుతున్న కళ్యాణగుమ్మి గ్రామస్థులు

అనంతగిరి, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గుమ్మ పంచాయతీ కళ్యాణగుమ్మి రోడ్డు నిర్మాణానికి అటవీశాఖ అనుమతులను కలెక్టర్ దినేశ్‌కుమార్ మంజూరు చేశారు. ఈ రోడ్డు నిర్మించాలని, అటవీశాఖ అనుమతులు మంజూరు చేయాలని జూన్ 11న తేదీన 'ఆంధ్రజ్యోతి'లో వచ్చిన కథనానికి జిల్లా కలెక్టర్ స్పందించారు. శుక్రవారం ప్రత్యేక డీఎల్‌సీ ఏర్పాటు చేసి, అటవీశాఖ అనుమతులను మంజూరు చేశారు. దీంతో గిరిజనులు కలెక్టర్ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. నేరళ్లపూడి నుంచి కళ్యాణగుమ్మి గ్రామానికి రోడ్డు పనులు ప్రారంభం కావాల్సి ఉంది.

రోడ్ల విస్తరణపై అభ్యంతరాలు తగవు: పెసా కమిటీ



తమాట్లాడుతున్న పెసా కమిటీ ప్రతినిధులు

జి.మాడుగుల, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): హైకోర్టు ఆదేశాల అనుసరించి ఏజెన్సీ వ్యాప్తంగా మండల కేంద్రాల రహదారుల ఇరువైపులా వంద అడుగుల మేర విస్తరించాలని మండల పెసా కమిటీ ప్రతినిధులు ప్రభుత్వాన్ని కోరారు. ఈ మేరకు శుక్రవారం 17 పంచాయతీల పెసా కమిటీ సభ్యులతో స్థానికంగా సమావేశమ య్యారు. భవిష్యత్తు అవసరాలు, అభివృద్ధి దృష్ట్యా న్యాయ స్థానం నిర్ణయానికి రాజకీయ పార్టీలు స్వాగతించాలి తప్పా, వ్యతిరేకించే ప్రయత్నాలు చేస్తూ అధికారులపై ఒత్తిడి తీసుకురావడం సరైంది కాదని వారు అభిప్రాయపడ్డారు. గిరిజనులకు వ్యతిరేకంగా తీసుకున్న ఏ రాజకీయ పార్టీకైనా రానున్న స్థానిక ఎన్నికలకు తగిన గుణపాఠం చెబుతామని వారు పరోక్షంగా హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మండల పెసా ఫోరం నేతలు ఎల్.రామకృష్ణ, ఎస్.బాలకృష్ణ, కె.శ్రీనుతో పాటు మండల ఉపాధ్యక్షులు పాల్గొన్నారు.

గ్రామాల్లో 'టీబీ ముక్తా భారత్ అభియాన్'



తుమ్మలపాలెంలో వైద్య పరీక్షలు చేస్తున్న సిబ్బంది

పాడేరురూరల్, జూన్ 13: టీబీ వ్యాధి గ్రస్థులకు ఆరోగ్య రక్షణకు ప్రభుత్వం అమలు చేస్తున్న టీబీ ముక్తా భారత్ అభియాన్ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని డీఎంహెచ్‌వో షేక్ జమీల్ బాషా కోరారు. శుక్రవారం ఈదులపాలెం పీహెచ్‌సీ పరిధిలోని మారుమూల దేవాపురం పంచాయతీ తుమ్మలపాలెం, అర్జపాలెం గ్రామాల్లో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా 60 ఏళ్ల పైబడినవారికి, షుగర్ వ్యాధి గ్రస్తులకు, ధూమపానం, మద్యపానం సేవించే వారికి, రెండు వారాలకు మించి దగ్గు, జ్వరంతో బాధపడుతున్న ప్రజలకు కఫం పరీక్షలను నిర్వహించారు. రోగుల కుటుంబ సభ్యులకు వ్యాధి లక్షణాలు లేక పోయిన ఎక్స్‌రే పరీక్షలను చేయించుకోవాలన్నారు. గ్రామాలకు వచ్చే వైద్య సిబ్బంది వద్ద కఫం పరీక్షలు, ఆరోగ్య పరీక్షలను చేయించుకోవాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో టీబీ సూపర్‌వైజర్ కె.సదానందం, ఫీల్డ్ కో-ఆర్డినేటర్ ధనరాజ్, ఎంఎల్‌హెచ్ పి.దేవి, ఏఎన్ఎం ఈశ్వరమ్మ, ఆశ కార్యకర్తలు, పీహెచ్‌సీ సిబ్బంది పాల్గొన్నారు.

ఊబలు గ్రామ సమస్యలు పరిష్కరించాలి: జనసేన



గ్రామస్థులతో మాట్లాడుతున్న జనసేన మండలాధ్యక్షుడు బుజ్జిబాబు

చింతపల్లి, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అంజలిశనివారం పంచాయతీ ఊబలు గ్రామానికి కనీస మౌలిక సదుపాయాలు కల్పించాలని జనసేన పార్టీ మండలాధ్యక్షుడు వంతల బుజ్జిబాబు అన్నారు. శుక్రవారం గ్రామాన్ని సందర్శించిన ఆయన స్థానికులతో మాట్లాడి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈసందర్భంగా మాట్లాడుతూ గ్రామానికి సరైన రహదారిలేదన్నారు. గ్రామంలో గిరిజనులకు పక్కా గృహాలు, తాగేందుకు మంచి నీటి పథకం అందుబాటులోలేదన్నారు. పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రాలకు భవనాలులేవన్నారు. స్థానిక గిరిజనులు ఎదుర్కొంటున్న సమస్యలను కలెక్టర్ దృష్టికి తీసుకు వెళతామని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు, గ్రామపెద్దలు వంతల రాజు, మఠం శ్రీనువాసు, దిలీప్, కోటేశ్వరరావు, పాంగి శివ, వంతల లక్ష్మణ్, సేందేరి రామదాసు పాల్గొన్నారు.

'కూటమి ప్రభుత్వంలో రైతులకు మేలు'



రైతులకు విత్తనాలను పంపిణీ చేస్తున్న దార్రెల సర్పంచ్ పాండురంగస్వామి

ముంచంగిపుట్టు, జూన్ 13 (ఆంధ్ర జ్యోతి): కూటమి ప్రభుత్వంలో రైతులు మేలు జరుగుతుందని దార్రెల సర్పంచ్ పాండురంగస్వామి తెలిపారు. గ్రామంలోని రైతులకు శుక్రవారం రాయితీ విత్తనాలను పంపిణీ చేశారు. వర్షాలకు ముందుగానే విత్తనాల పంపిణీతో ఎంతో మేలు చేకూరుతుందన్నారు. కార్యక్రమంలోని ఎం పీటీసీ సభ్యులు మల్లి కార్జున్, చందు, తదితరులు పాల్గొన్నారు.

ప్లాస్టిక్ కవర్లో పసికందు!



చింతూరు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న శిశువు

చింతూరు, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): ఓ తల్లి పండంటి మగ బిడ్డకు జన్మనిచ్చింది. ఆ మరుక్షణమే ఆ పసికందుని ప్లాస్టిక్ కవర్లో ఉంచి ఆ కవర్‌ని చెట్టుకు వేలాడదీసి తన పేగు బంధాన్ని తుంచుకొని అక్కడి నుంచి గుట్టుచప్పుడు కా కుండా మాయమైంది. అల్లూరి సీతారామరాజు జిల్లా వరరామచంద్రపురం మండలం కొక్కిరిగూడెం అటవీ ప్రాంతంలో ఈ సంఘటన చోటుచేసుకుంది. శుక్రవారం కొక్కిరిగూడెంనకు చెందిన కొందరు అటవీ ప్రాంతానికి వేటకువెళ్లారు. పసికందు రోదన వేటకెళ్లిన మడివి రత్నరాజుకి వినిపించింది. అనంతరం అతను చెట్టుకు వేలాడుతున్న ప్లాస్టిక్ కవర్ తోపాటు అందులో ఉన్న పసికందుని గుర్తించాడు. వెంటనే ఇంటికివెళ్లి తన తల్లి ముత్తమ్మకు విషయం వివరించాడు. దీంతో ముత్తమ్మ చెట్టు వద్దకు చేరుకొని ఆ పసికందుని తీసుకుని ఇంటికెళ్లింది. సమాచారం మేరకు కుందులూరు సబ్‌సెంటర్ ఏఎన్ఎం గుంపెన పల్లి చంద్రమ్మ బృందం వెళ్లి హుటాహుటిన పసికందుని చింతూరు ఏరియా ఆసుపత్రికి తరలించారు. ఆసుపత్రి సూపరిం టెండెంట్ కోటిరెడ్డి నేతృత్వంలో చిన్నపిల్లల వైద్య నిపుణుడు మహేశ్ ఆ పసికందుకి వైద్య సహాయం అంది స్తున్నారు. బిడ్డ పుట్టి దాదాపు ఏడు ఎనిమిది గంటలపాటు ఏడ్వడం, బొడ్డు తొలగించకపోవడంతో పరిస్థితి విషమంగా ఉందని వైద్యులు తెలిపారు. ఎవరి బిడ్డ అనేది తమకు తెలియరాలేదని, దీంతో పోలీసులకు సమాచారం ఇచ్చామని డాక్టర్ కోటిరెడ్డి తెలిపారు.

గోవాడ రైతులు, కార్మికుల బకాయిలు చెల్లించండి

- క్రషింగ్‌పై బహిరంగ ప్రకటన చేయాలి
- గోవాడ ఫ్యాక్టరీ కొత్త ఎండీకి ఏపీ రైతు సంఘం నేతల వినతి


ఫ్యాక్టరీ ఎండీ వెంకటేశ్వరరావుకు వినతిపత్రం ఇస్తున్న రైతు సంఘం నాయకులు

చోడవరం, జూన్ 13(ఆంధ్రజ్యోతి): గోవాడ షుగర్ ఫ్యాక్టరీ చెరకు రైతులు, కార్మికుల బకాయిలు చెల్లించడానికి చర్యలు చేపట్టాలని, క్రషింగ్ సీజన్ కొనసాగింపుపై యాజమాన్యం తరఫున బహిరంగ ప్రకటన చేయాలని ఏపీ రైతు సంఘం సీఐటీయూ నాయకులు శుక్రవారం కొత్తగా నియమితులైన గోవాడ షుగర్స్ ఎండీ వెంకటేశ్వరరావుకి విజ్ఞప్తి చేశారు. బకాయిలు చెల్లించడంతో పాటు వచ్చే సీజన్‌కు సంబంధించి ఫ్యాక్టరీ నడిపించడానికి అవసరమైన చర్యలు చేపట్టాలని కోరారు. ఈ మేరకు బహిరంగ ప్రకటన ఇవ్వాలని కోరారు. అనంతరం రైతు సంఘం నాయకులు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు నాయనిబాబు, వి.వి. శ్రీనివాసరావు, ఎస్‌వీ నాయుడు, తదితరులు పాల్గొన్నారు.

గోవాడ షుగర్స్ ఎండీని కలిసిన కార్మిక సంఘం సభ్యులు

గోవాడ షుగర్ ఫ్యాక్టరీ ఎండీగా గురువారం బాధ్యతలు చేపట్టిన వెంకటేశ్వరరావును ఫ్యాక్టరీ కార్మిక సంఘం నాయకుడు బొబ్బిలి సూర్యనారాయణ ఆధ్వర్యంలో కార్మికులు మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా వచ్చే సీజన్‌కు సంబంధించి తీసుకోవలసిన నిర్ణయాలు, ఇతర అంశాలు, రైతులు, కార్మికుల సమస్యలపై ఎండీతో మాట్లాడారు. ఈ కార్యక్రమంలో దున్నా రమణ, రామారావు, సత్యనారాయణరాజు, వసాది రమణ, రాపేటి జగన్నాథరావు, బండి శ్రీను తదితరులు పాల్గొన్నారు.

నేడు యోగాపై ప్రత్యేక శిక్షణ

చీడికాడ, జూన్ 13(ఆంధ్రజ్యోతి): అన్ని పంచాయతీ కేంద్రాల్లో శనివారం ఉదయం 6 నుంచి 8 గంటల్లోగా యోగాపై ప్రత్యేక శిక్షణ ఇవ్వాలని ఎంపీడీవో హేమసుందరరావు ఆదేశించారు. ఈ మేరకు శుక్రవారం మధ్యాహ్నం మండల స్థాయి అధికారులు, పంచాయతీ కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కలెక్టర్ ఆదేశాల మేరకు ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయడానికి ఇటీవల యోగాంధ్రలో పేర్లు నమోదు చేసుకున్న వారితో యోగా చేయించాలని ఆదేశించారు. ఈ సమావేశంలో తహశీల్దార్ కిషోర్ లింకన్, ఆయుష్ వైద్యాధికారి ఆర్.స్వర్ణలత, తదితరులు పాల్గొన్నారు.

27 నుంచి జగన్నాథ స్వామి దశావతార దర్శనాలు

చోడవరం, జూన్ 13(ఆంధ్రజ్యోతి): స్థానిక కేశవస్వామి ఆలయంలో ఈ నెల 27 నుంచి జూలై 7 వరకు జగన్నాథస్వామి దశావతార దర్శనాలు ప్రారంభం కానున్నాయని శేషసాయి ఆలయ ప్రధానార్చకులు సుదర్శనశేషాచార్యులు శుక్రవారం తెలిపారు. ఏటా భారీగా నిర్వహించే ఈ జగన్నాథస్వామి దశావతార దర్శన ఉత్సవాల్లో పెద్ద ఎత్తున భక్తులు పాల్గొనాలని ఆయన కోరారు.

వ్యవసాయాధికారిణిగా సుగుణ బాధ్యతల స్వీకారం


బాధ్యతలు చేపట్టిన సుగుణ

నాతవరం, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): నాతవరం మండల నూతన వ్యవసాయాధికారిణిగా శుక్రవారం గట్ల సుగుణ బాధ్యతలు స్వీకరించారు. ఈమె నర్సీపట్నం ఏడీఏ కార్యాలయంలో పని చేస్తూ నాతవరానికి బదిలీపై వచ్చారు. ఇక్కడ వ్యవసాయాధికారిణిగా ఉన్న తెలగ సన్యాసిరావు ఏడీఏ కార్యాలయానికి బదిలీపై వెళ్లారు. నూతన వ్యవసాయాధికారిణిగా బాధ్యతలు చేపట్టిన సుగుణ మాట్లాడుతూ ప్రభుత్వ పథకాలు అర్హులైన రైతులకు అందేటట్టు చూడడమే కాకుండా క్షేత్రస్థాయిలో అందుబాటులో ఉంటానని పేర్కొన్నారు.

ప్రధాని మోదీ 11 ఏళ్ల పాలనపై సంబరాలు

కె.కోటపాడు, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): ప్రధాని నరేంద్ర మోదీ 11 ఏళ్ల పరిపాలనపై బీజేపీ శ్రేణులు సంబరాలు జరుపుకున్నాయి. శుక్రవారం కె.కోటపాడులోని బీజేపీ కార్యాలయ ఆవరణలో బీజేపీ మండల అధ్యక్షులు పైలా అప్పాజీ కేక్ కట్ చేసి నాయకులు, కార్యకర్తలకు పంచారు. ఈ కార్యక్రమంలో ఆ పార్టీ నాయకులు కేతినేని సురేంద్రమోహన్, పల్లా సత్యనారాయణమూర్తి, బండారు సత్యనారాయణపాత్రుడు, ఇమంది సన్యాసిరావు, గజ్జి అప్పలనాయుడు, తదితరులు పాల్గొన్నారు.

19 నుంచి దుర్గాంబికా ఆలయ వార్షిక మహోత్సవం


ఉత్సవాల పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న దృశ్యం

రావికమతం, జూన్ 13(ఆంధ్రజ్యోతి): మండలంలోని మేజరు పంచాయతీ కొత్తకోటలోని దుర్గాంబిక అమ్మవారి ఆలయ 15వ వార్షిక మహోత్సవాన్ని ఈ నెల 19 నుంచి రెండు రోజుల పాటు ఘనంగా నిర్వహించనున్నారు. ఈ మేరకు శుక్రవారం ఉత్సవాల పోస్టర్‌ను టీడీపీ నియోజకవర్గ మహిళా అధ్యక్షురాలు కోట నీలవేణి, గోవిందరావు దంపతులు, ఉత్సవ కమిటీ సభ్యులు ఆవిష్కరించారు.

అన్నదాత సుఖీభవ పథకానికి బయోమెట్రిక్ తప్పనిసరి

బుచ్చెయ్యపేట, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): మండలంలో అన్నదాత సుఖీభవ పథకానికి అర్హుల జాబితా రైతు సేవా కేంద్రాల్లో అందుబాటులో ఉందని, అర్హులు తప్పనిసరిగా బయోమెట్రిక్ వేయాలని ఏవో భాస్కరరావు తెలిపారు.

దోమల నివారణకు స్ప్రేయింగ్ అవసరం


కోనాం పాఠశాలలో స్ప్రేయింగ్ చేస్తున్న సిబ్బంది

చీడికాడ, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): ప్రాణాంతక దోమల నివారణకు స్ప్రేయింగ్ ఎంతో అవసరమని చీడికాడ పీహెచ్‌సీ హెల్త్ సూపర్‌వైజర్ వి.వెంకటరావు అన్నారు. మండలంలోని కోనాం గురుకుల బాలికల పాఠశాల, కోనాం గురుకుల ఆశ్రమోన్నత పాఠశాల, మంచాల మోడల్ స్కూల్‌లో శుక్రవారం స్ప్రేయింగ్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో స్టాఫ్‌నర్సు వరలక్ష్మి, ఆశా వర్కర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

శ్మశాన వాటికలో కొళాయిలు ప్రారంభం


కొళాయిలను ప్రారంభిస్తున్న జడ్పీటీసీ సభ్యుడు రాంబాబు, తదితరులు

బుచ్చెయ్యపేట, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సంతపాలెం వద్ద గల శ్మశాన వాటికలో స్థానికుల కోసం ఏర్పాటు చేసిన కొళాయిలను శుక్రవారం జడ్పీటీసీ సభ్యుడు రాంబాబు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ దొండా లలిత నారాయణమూర్తి, డీసీసీబీ మాజీ డైరెక్టర్ కోవెల జనార్దన్, వడ్డాది ఎంపీటీసీ-2 కొరుకొండ లీలావతి, తదితరులు పాల్గొన్నారు.

భూసార పరీక్షా కేంద్రం తెరుచుకునేదెన్నడో?

- నాలుగేళ్ల క్రితం మూతపడిన నర్సీపట్నం కేంద్రం
- మట్టి నమూనాలకు అనకాపల్లి ఎస్‌టీఎల్‌లో పరీక్షలు
- ఏటా ఖరీఫ్‌కి ముందు మట్టి నమూనాల సేకరణ
- నర్సీపట్నం సబ్ డివిజన్‌లో 5,242 నమూనాలు సేకరించి రైతు సేవా కేంద్రాల ద్వారా అనకాపల్లి తరలింపు



ఏఎంసీ ఆవరణలో మూతపడిన భూసార పరీక్షా కేంద్రం


మట్టి నమూనాలు సేకరిస్తున్న సిబ్బంది

నర్సీపట్నం, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): నర్సీపట్నం వ్యవసాయ మార్కెట్ యార్డు ఆవరణలో నాలుగేళ్ల క్రితం మూతపడిన భూసార పరీక్షా కేంద్రం తెరుచుకోకపోవడంతో రైతులు నుంచి సర్వత్రా విమర్శలు వస్తున్నాయి. ప్రతీ ఏటా ఖరీఫ్ ముందు మట్టి నమూనాలు సేకరించి భూసార పరీక్షా కేంద్రాలలో పరీక్షలు చేసి పోషకాల వినియోగంపై రైతులకు సూచనలు చేస్తారు. ఇక్కడ భూసార పరీక్షా కేంద్రం మూతపడడంతో అనకాపల్లి పంపించి పరీక్షలు చేయాల్సి వస్తుంది. దీని వలన పరీక్షల ఫలితాలు రావడంలో జాప్యం అవుతోంది.

సబ్ డివిజన్‌లో 5,242 నమూనాల సేకరణ

వ్యవసాయ శాఖ ఏడీఏ పరిధిలో ప్రభుత్వం ఇచ్చిన లక్ష్యం మేరకు నర్సీపట్నంలో 912, గొలుగొండలో 850, రోలుగుంటలో 880, రావికమతంలో 1,210, మాడుగులలో 1,390 నమూనాలు సేకరించి రైతు సేవా కేంద్రాల ద్వారా అనకాపల్లిలోని భూసార పరీక్షా కేంద్రానికి పంపించారు. గత రెండేళ్లుగా మట్టి నమూనాలు తీయని రైతుల భూములు గుర్తించి ఈ సంవత్సరం భూసార పరీక్షలకు నమూనాలు సేకరించారు. ఏ ప్రాంతంలో మట్టి నమూనా సేకరిస్తున్నారో ఆ రైతు జియో టాగింగ్‌తో ఫొటో తీసి అప్‌లోడ్ చేశారు. ప్రతీ నమూనాకు క్యూఆర్ కోడ్ ఇచ్చారు. దాని మీద స్కాన్ చేస్తే వివరాలు అన్నీ తెలుస్తాయి. ఫలితాలు నెలాఖరుకు రావచ్చని ఏడీ శ్రీదేవి చెప్పారు.

కూటమి ప్రభుత్వంలో ప్రతిపాదనలు

గత వైసీపీ ప్రభుత్వంలో భూసార పరీక్షా కేంద్రం మూతపడింది. అందులోని సామగ్రి అంతా పాడైంది. నియోజకవర్గంలో ఏర్పాటు చేసిన అగ్రి ల్యాబ్‌లలో భూసార పరీక్షలు కూడా చేస్తారని ప్రకటించారు. అయితే కార్యరూపం దాల్చలేదు. దీంతో కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత ఏడీఏ శ్రీదేవి ఉన్నతాధికారులకు ప్రతిపాదనలు పంపారు. జడ్పీటీసీ సుకల రమణమ్మ సైతం జడ్పీ సమావేశంలో ఈ సమస్యను లేవనెత్తారు.

ఉపయోగాలు ఇవీ...

భూసార పరీక్షల వలన నేలలో సహజంగా ఉండే పోషకాల స్థాయిని తెలుసుకోవచ్చు. నారు మడులు సిద్ధం చేసుకుని దుక్కు పట్టి పంట వేయబోయే ముందు ఎంత మోతాదులో ఎరువులు వేయాలో పరీక్షల ద్వారా తెలుస్తుంది. ఎరువులు మోతాదుకు మించి వాడడం వలన రైతు ఆర్థికంగా నష్టపోవడంతో పాటు భూసారం మీద ప్రభావం పడుతుంది. అందు వలన భూసార పరీక్షలు చేసి ఎంత మోతాదులో పోషకాలు ఉన్నాయో నిర్ధారణ చేస్తారు.

విద్యార్థులకు యూనిఫారం, పుస్తకాలు పంపిణీ


రావికమతం జడ్పీ హైస్కూల్‌లో విద్యార్థులకు యూనిఫారం, పుస్తకాలు అందిస్తున్న ఉప సర్పంచ్ మోదునాయుడు, తదితరులు


బుచ్చెంపేట హైస్కూల్‌లో విద్యార్థులకు విద్యామిత్ర కిట్లు అందజేస్తున్న దృశ్యం

రావికమతం, జూన్ 13(ఆంధ్రజ్యోతి): స్థానిక జడ్పీ హైస్కూల్‌లో శుక్రవారం విద్యార్థులకు యూనిఫారం, పుస్తకాలను రావికమతం ఉప సర్పంచ్ గంజి మోదునాయుడు పంపిణీ చేశారు. పాఠశాల పేరెంట్స్ కమిటీ చైర్మన్ భూపాల అప్పారావు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో 310 మంది విద్యార్థిని, విద్యార్థులకు యూనిఫారం, పుస్తకాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ సీనియర్ నాయకుడు వేపాడ నాగేశ్వరరావు, హెచ్‌ఎం బీవీ శ్రీనివాస్, ఉపాధ్యాయులు బంటు సత్యారావు, వేపాడ సత్యనారాయణ, పి.రాము, తదితరులు పాల్గొన్నారు.

నాతవరంలో...

నాతవరం: నాతవరం జిల్లా పరిషత్ హైస్కూల్‌లో శుక్రవారం విద్యార్థులకు పాఠ్య పుస్తకాలు పంపిణీ చేశారు. అలాగే విద్యామిత్ర కిట్లు కూడా అందజేశారు. ఈ కార్యక్రమంలో జడ్పీటీసీ సభ్యురాలు అప్పలనర్స, టీడీపీ నాయకుడు అపిరెడ్డి మాణిక్యం, స్కూల్ కమిటీ చైర్మన్ చిటికెల శ్రీను, మాజీ ఎంపీపీ ఎస్.విజయకుమార్, స్కూల్ కమిటీ మాజీ చైర్మన్ పోలుపర్తి శ్రీనివాసు, అంకంరెడ్డి యర్రాపాత్రుడు, మండల తెలుగు యువత అధ్యక్షుడు శెట్టి లోవ, మండల ఎస్సీ సెల్ అధ్యక్షుడు బంగారు నూకేశ్వరరావు, హెచ్‌ఎం కూండ్రపు సత్యనారాయణ, సామర్ల రామారావు పాల్గొన్నారు.

బుచ్చెంపేటలో..

రోలుగుంట: బుచ్చెంపేట జడ్పీ పాఠశాలలో శుక్రవారం విద్యార్థులకు విద్యామిత్ర కిట్లను అందజేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం ఎస్‌వీఎస్ వరలక్ష్మి, పాఠశాల చైర్మన్ చిటికెల వెంకటరమణ, టీడీపీ యూత్ నాయకులు కర్రి వెంకట రమణ, శ్యామల, తదితరులు పాల్గొన్నారు.

పారిశుధ్య కార్మికుల సమస్యలు పరిష్కరించాలి


మునిసిపల్ కమిషనర్ సురేంద్రకు వినతి పత్రం ఇస్తున్న పారిశుధ్య కార్మికులు

నర్సీపట్నం, జూన్ 13(ఆంధ్రజ్యోతి): అపరిష్కృతంగా ఉన్న తమ సమస్యలను పరిష్కరించాలని మునిసిపల్ వర్కర్స్ ఎంప్లాయిస్ యూనియన్ సీఐటీయూ ఆధ్వర్యంలో పారిశుధ్య కార్మికులు శుక్రవారం మునిసిపల్ కమిషనర్‌ను కలిసి వినతి పత్రం అందజేశారు. 60 వేల జనాభా కలిగిన నర్సీపట్నం మునిసిపాలిటీలో అందుకు సరిపడా పారిశుధ్య కార్మికులు లేక ప్రస్తుతం పని చేస్తున్న కార్మికులపై పని భారం పడుతోందని తెలిపారు. జనాభాకు అనుగుణంగా కార్మికుల నియామకాలు జరగాలని సీఐటీయూ నాయకుడు ఆడిగర్ల రాజు కోరారు. పారిశుధ్య కార్మికులకు డ్రైవర్ డ్యూటీలు వేయడం తగదన్నారు. ట్రాక్టర్ మగ్గురు కార్మికులు ఉండే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. పుష్ కాట్స్ సమీపంలో ట్రాక్టర్‌ను పంపాలన్నారు. మరణించిన కార్మికుల స్థానంలో కుటుంబ సభ్యులకు ఉద్యోగం ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు నూకరాజు, మంజేటి లోవరాజు, కె.రాజు, ఎం.బాబూరావు, పాల్గొన్నారు.

డీసీసీబీ చైర్మన్ కోన తాతారావుకు సత్కారం


డీసీసీబీ చైర్మన్ కోన తాతారావును కలిసిన జనసేన నాయకులు

మాడుగుల రూరల్, జూన్ 13 (ఆంధ్రజ్యోతి) : డీసీసీబీ చైర్మన్ కోన తాతారావును మాడుగుల మండల జనసేన నాయకులు శుక్రవారం మర్యాద పూర్వకంగా కలిశారు. ఆయనకు శాలువా కప్పి సత్కరించారు. ఈ కార్యక్రమంలో జనసేన మాడుగుల మండల జనసేన పార్టీ అధ్యక్షులు గట్టెడ్డి శివాజీ, ప్రధాన కార్యదర్శి దాసరి అచ్చుతరావు, పిల్లా నాయుడు, బుదిరెడ్డి కన్న, గుమ్మాల నానాజీ తదితరులు పాల్గొన్నారు.

రుణ రికవరీకి వెళ్లిన బ్యాంకు సిబ్బందిపై దాడి

- పోలీసులకు ఫిర్యాదు చేసిన డీసీసీబీ బ్యాంకు సిబ్బంది

అనకాపల్లి, జూన్ 13(ఆంధ్రజ్యోతి): రికవరీకి వెళ్లిన బ్యాంకు సిబ్బందిపై రుణం తీసుకున్న వ్యక్తి దాడి చేసిన సంఘటన జానకిరాంపురంలో శుక్రవారం చోటుచేసుకుంది. దీనికి సంబంధించి పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. జిల్లా కేంద్ర సహకార బ్యాంకు(డీసీసీబీ) నర్సీపట్నం బ్రాంచి పరిధిలోని రోలుగుంట మండలం జానకిరాంపురం పీఏసీఎస్‌లో 2019లో స్వయంకృషి పథకం కింద ఆదే గ్రామానికి చెందిన మేడపురెడ్డి రమేశ్ రుణం తీసుకున్నారు. అప్పటి నుంచి చెల్లింపులు జరపకపోవడంతో రుణ బకాయి రూ.2 లక్షలకు పైగా చేరింది. దీంతో శుక్రవారం బ్రాంచి మేనేజర్ సత్యనారాయణ, నోడల్ ఆఫీసర్ రామకృష్ణ, ఏజీఎం అశోక్‌కుమార్, తదితరులు రమేశ్ ఇంటికి వెళ్లి తీసుకున్న రుణం చెల్లించమని అడిగారు. దీంతో వారిని రమేశ్ దుర్భాషలాడడంతో పాటు దాడికి పాల్పడ్డాడు. ఈ ఘటనపై శుక్రవారం బ్రాంచి మేనేజర్ సత్యనారాయణ ఆధ్వర్యంలో బ్రాంచి సిబ్బంది, పీఏసీఎస్ సిబ్బంది రోలుగుంట పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

రోడ్లపై మురుగునీటి ప్రవాహం

- రహదారులు ఛిద్రం


లక్ష్మీపురం రోడ్డులోని కోనాం అతిథి గృహానికి సమీపంలో మురుగు నీరుతో పాడవుతున్న రోడ్డు (ఫైల్)

చోడవరం, జూన్ 13(ఆంధ్రజ్యోతి): పట్టణంలో పలు చోట్ల డ్రైనేజీలు లేకపోవడంతో మురుగునీరు రోడ్లపై ప్రవహిస్తోంది. దీంతో రహదారులు గోతులమయంగా మారుతున్నాయి. ఇదే పరిస్థితి పట్టణంలోని లక్ష్మీపురం మార్గంలో ఉంది. పట్టణంలోని ప్రధాన రహదారి నుంచి లక్ష్మీపురం వరకు గత ఏడాది తారురోడ్డు వేశారు. రాకపోకలకు అనువుగా ఉండడంతో వాహనచోదకులు మురిసిపోయారు. క్రమంగా వీటి ఆనందం ఎంతో కాలం నిలవలేదు. స్థానిక కోనాం అతిథి గృహం సమీపంలోని ఇళ్ల నుంచి వచ్చే మురుగునీరు ఈ రహదారిపై పారుతుండడంతో పాటు, నిల్వ ఉండడంతో తారురోడ్డు క్రమంగా గోతులు ఏర్పడి దెబ్బతింటున్నది. పరిస్థితి ఇలాగే కొనసాగితే ఈ తారురోడ్డు మరికొద్ది రోజుల్లో మళ్లీ మునుపటి విధంగా గోతులు ఏర్పడి దారుణంగా తయారయ్యే ప్రమాదం ఉందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కోనాం అతిథి గృహం సమీపంలో రోడ్డుకు ఇరువైపులా మురుగునీటి కాలువలు లేకపోవడంతో ఈ నీరు రోడ్డుపైనే పారుతుంది. ఇక్కడ కాలువలు నిర్మించి మురుగు నీరు రోడ్డుపైకి రాకుండా ఏర్పాటు చేస్తే తప్ప ఈ రోడ్డు బాగుపడే పరిస్థితి కనిపించడం లేదు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ఈ ప్రాంతంలో మురుగునీరు రోడ్డుపైకి రాకుండా చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

శివశక్తి క్షేత్రం సందర్శన శివానుగ్రహమే..

- సినీ రచయిత జేకే భారవి


చిక్కుడుపాలెంలోని శివశక్తి క్షేత్రాన్ని సందర్శించిన సినీ రచయిత జేకే భారవి

నాతవరం, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): నాతవరం మండలం గుమ్మిడిగొండ పంచాయతీ శివారు చిక్కుడుపాలెం గ్రామ సమీపంలో తాండవ నది వద్ద ఉన్న భూగర్భ శివశక్తి క్షేత్రాన్ని దర్శించడం శివానుగ్రహంగా భావిస్తున్నానని ప్రముఖ సినీ రచయిత జేకే భారవి అన్నారు. శుక్రవారం ఆయన చిక్కుడుపాలెంలో భూగర్భ శివశక్తి క్షేత్రాన్ని సందర్శించి ఆలయ విశిష్టతను ఆలయ ధర్మకర్త కేఎస్ఎన్ శర్మను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా జేకే భారవి మాట్లాడుతూ చిక్కుడుపాలెం భూగర్భ ఆలయాన్ని తాను దర్శించుకున్నప్పుడు కాశీ, శ్రీశైలం ఆలయాలను సందర్శించిన అనుభూతి కలిగిందన్నారు. కాగా ఆయన మంజునాథ, ఆదిశంకరాచార్యులు, శ్రీరామదాసు, నమో వెంకటేశ, అన్నమయ్య తదితర సినిమాలకు పాటల రచయితగా పని చేశారు.

గ్రామ పరిశుభ్రతకు ప్రాధాన్యం ఇవ్వాలి


సంపద తయారీ కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఈవోపీఆర్‌డీ చంద్రశేఖరరావు

చీడికాడ, జూన్ 13(ఆంధ్రజ్యోతి): గ్రామ పరిశుభ్రతకు అందరూ ప్రాధాన్యమివ్వాలని ఈవోపీఆర్‌డీ సీహెచ్ చంద్రశేఖరరావు ఆదేశించారు. మండలంలోని జి.కొత్తపల్లి గ్రామ పంచాయతీలో శుక్రవారం ఆయన తనిఖీలు చేశారు. ఈ మేరకు పంచాయతీ రికార్డులను, చెత్త నుంచి సంపద తయారీ కేంద్రం రికార్డులను పరిశీలించారు. తడి, పొడి చెత్తలను వేరు చేసే డంపింగ్ యార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇంటింటి నుంచి సేకరించిన చెత్తలను వేరు చేయాలని ఆదేశించారు. అనంతరం సచివాలయ సిబ్బందితో సమావేశం నిర్వహించి శనివారం జరిగే యోగా శిక్షణపై పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. ఇప్పటి వరకు 500 కిలోల వర్మి కంపోస్టు విక్రయించామని ఈవోపీఆర్‌డీకి పంచాయతీ కార్యదర్శి పట్నాలగోపి తెలిపారు. ఈ కార్యక్రమంలో పలువురు సిబ్బంది పాల్గొన్నారు.

తహశీల్దార్‌గా వెంకట రమణ బాధ్యతల స్వీకరణ


బాధ్యతలు స్వీకరించిన తహశీల్దార్ వెంకట రమణ

మాకవరపాలెం, జూన్ 13(ఆంధ్రజ్యోతి): నూతన తహశీల్దార్‌గా వెంకట రమణ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఆయన రావికమతం తహశీల్దార్‌గా పని చేస్తూ బదిలీపై మాకవరపాలెం వచ్చారు. బాధ్యతలు స్వీకరించిన వెంకట రమణకు రీసర్వే డీటీ కృష్ణమూర్తి, ఆర్ఐ జట్టితో పాటు వీఆర్‌వోలు పుష్పగుచ్ఛాలు ఇచ్చి అభినందనలు తెలిపారు.

భారీ వర్షం

చీడికాడ, జూన్ 13(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రం చీడికాడతో పాటు పలు గ్రామాల్లో శుక్రవారం సాయంత్రం భారీ వర్షం కురిసింది. సాయంత్రం సుమారు ఐదు గంటల నుంచి అరున్నర గంటల వరకు భారీ వర్షం పడడంతో పొలాలు, రోడ్లపై వర్షపునీరు నిలిచిపోయింది.

మాడుగులలో..

మాడుగుల రూరల్: మండలంలో శుక్రవారం సాయంత్రం మోస్తరు వర్షం పడింది. ఉదయం నుంచి వాతావరణం పొడిగా ఉంది. ఓ మాదిరిగా ఎండ కాసింది. సాయంత్రం ఐదు గంటలకు ఒక్కసారిగా వాతావరణం మారింది. ఆకాశం మేఘావృతమై మోస్తరు వర్షం పడింది.

గంజాయి కేసులో నిందితుడికి జైలు, జరిమానా

నర్సీపట్నం, జూన్ 13(ఆంధ్రజ్యోతి): గంజాయి రవాణా కేసులో నిందితుడికి రెండేళ్ల జైలు శిక్ష, రూ.10 వేల జరిమానా విధిస్తూ న్యాయమూర్తి తీర్పు ఇచ్చారు. శుక్రవారం ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ సునీల్‌కుమార్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. 2014 ఆక్టోబరు 10న నర్సీపట్నం మునిసిపాలిటీ శివపురానికి చెందిన తుమ్మల వెంకటేశ్వరరావు 10 కిలోల గంజాయితో ఎక్సైజ్ అధికారులు పట్టుకుని అరెస్టు చేసి రిమాండ్ తరలించారు. తర్వాత కేసు విచారణ పూర్తి చేసి విశాఖ ఎన్‌డీపీఎస్ కోర్టు చార్జిషీటు దాఖలు చేసింది. ప్రభుత్వం తరఫున న్యాయవాది వాదనలు విన్న తర్వాత నేరం రుజువు చేయడంతో నిందితుడికి రెండేళ్ల జైలు శిక్ష, రూ.10 వేలు జరిమానా విధిస్తూ న్యాయమూర్తి తీర్పు ఇచ్చారు.

ప్రాణదాతలు

రక్తదానానికి ఎంతోమంది సుముఖం

అపోహలతో ఇంకా కొందరు దూరం

» ఏటా మూడుసార్లు రక్తదానం చేస్తే ఆరోగ్యం

» నేడు స్వచ్ఛంద రక్తదాతల దినోత్సవం





విశాఖపట్నం, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): ప్రపంచ వ్యాప్తంగా అనేక ఆవిష్కరణలు జరుగుతున్నాయి. వైద్య రంగంలోనూ సరికొత్త సాంకేతికతలు అందుబాటులోకి వస్తున్నాయి. అయితే, ఇప్పటికీ అత్యవసర పరిస్థితులలో మనిషి ప్రాణాన్ని నిలబెట్టే రక్తాన్ని మరో మనిషి మాత్రమే ఇవ్వాల్సిన పరిస్థితి నెలకొంది. శాస్త్ర, సాంకేతిక రంగాలు ఎంత అభివృద్ధి చెందినా, రక్తాన్ని తయారు చేసే సరికొత్త సాంకేతికత మాత్రం అందుబాటులోకి రాలేదు. ప్రాణాపాయ స్థితిలో ఉన్న వ్యక్తికి సాటి మనిషి మాత్రమే రక్తాన్ని అందించి కాపాడాలి. ఒకప్పుడు రక్తదానానికి ఎవరూ ముందుకు వచ్చేవారు కాదు. దీంతో అనేకమంది సకాలంలో రక్తం అందక ప్రాణాలు కోల్పోయారు. ఈ పరిస్థితిలో మార్పు తేవడానికి తీవ్రస్థాయిలో ప్రయత్నాలు జరిగాయి. రక్తదానంపై అపోహలు తొలగించేలా చైతన్యపరిచారు. ఇప్పటికీ కొందరిలో అపోహలు, భయాలు ఉన్నా, రక్తదానానికి వెనుకంజ వేస్తున్నా, గతంతో పోలిస్తే ముందడుగు వేసినట్లే. ఏటా జూన్ 14న స్వచ్ఛంద రక్తదాతల దినోత్సవాన్ని నిర్వహిస్తున్నారు. ఈ నేపథ్యంలో సమాజంలో తాజా పరిస్థితులపై ప్రత్యేక కథనం.

రక్తదానంతో నలుగురి ప్రాణాలు నిలబెట్టవచ్చు

ఓ వ్యక్తి ఒకసారి రక్తదానం చేయడం వల్ల అత్యవసర పరిస్థితుల్లో ఉన్న నలుగురి ప్రాణాలు కాపాడేందుకు అవకాశం ఉంది. రక్తదానం చేసిన వ్యక్తి నుంచి రక్తం, ప్లాస్మా, ప్లేట్‌లెట్స్ సేకరించి ప్రాణాలను కాపాడేందుకు అవకాశం ఉంది. అంటే ప్రతి మనిషి ఏడాదికి 12 మంది ప్రాణాలను నిలబెట్టగలిగే అవకాశం, వెలలేని సంతృప్తి పొందే అవకాశం ఉంది. కావలసిందల్లా అపోహలు తొలగించుకోవడమే.

రక్తంలో ఏముంటాయంటే.?

ప్రతి ఒక్కరి శరీరంలో కనీసం ఐదు నుంచి ఆరు లీటర్ల రక్తం ఉండాలి. కేజీ శరీరం బరువుకు 80 ఎంఎల్ చొప్పున రక్తం ఉండాలి. శరీరంలోని అవయవాలు సక్రమంగా పని చేసేందుకు ఈ రక్తం ఉపయోగపడుతుంది. రక్తంలో 55 శాతం ప్లాస్మా, 45 శాతం సెల్స్ ఉంటాయి. ప్లాస్మాలో 91 శాతం నీరు, 8 శాతం ఆర్గానిక్ మాలిక్యూల్స్, ఒక శాతం ఇనార్గానిక్ మాలిక్యూల్స్ ఉంటాయి. సెల్స్‌లో ఎర్ర రక్తకణాలు, తెల్ల రక్తకణాలు, ప్లేట్ లెట్స్ ఉంటాయి. ఒక లీటర్ రక్తంలో ఎర్ర రక్తకణాలు 5-6 మిలియన్లు ఉంటాయి. ఇవి ఆక్సిజన్ సరఫరాకు తోడ్పడతాయి. తెల్ల రక్తకణాలు 4-11 మిలియన్లు ఉంటాయి. ఇవి శరీరంలోని ఇన్‌ఫెక్షన్‌పై దాడి చేసి రక్షణ కల్పిస్తాయి. ప్లేట్‌లెట్స్ కణాలు 1.5-4 మిలియన్లు ఉంటాయి. ఇవి రక్తం గడ్డ కట్టడానికి సహకరిస్తాయి. ఎర్ర రక్త కణాలు తగ్గితే ఎనీమియా అంటారు. ఎర్ర రక్తకణాలు శరీరంలో ఆక్సిజన్ సరఫరాకు ఉపయోగపడతాయి. ఐరన్, ఫోలిక్ ఆసిడ్, విటమిన్ బి 12, విటమిన్ సి, తగినంత ప్రోటీన్లు లేకపోవడం వల్ల రక్తహీనత ఏర్పడుతుంది.

రక్తం అవసరం ఎప్పుడంటే.?

రక్తం అత్యవసర సమయాల్లో తప్పనిసరిగా అవసరం. ప్రసవ సమయంలో అధిక రక్తస్రావం జరిగినా, గర్భ సంబంధ వ్యాధులకు గురైనా, రోడ్డు ప్రమాదాల సమయంలో, లివర్ సమస్య వేధించినా, తలసేమియా బాధిత చిన్నారులకు, నెలలు నిండకుండా పుట్టిన చిన్నారులకు, రక్త క్యాన్సర్, కీమోథెరపీ, గుండె, ఇతర శస్త్రచికిత్సల సమయాల్లో, రక్తలేమి, రక్తహీనత సమస్యలతో బాధపడుతున్న వారికి రక్తం అవసరమవుతుంది.

రక్తదానానికి అర్హులు వీరే

రక్తదాతలు సంపూర్ణ ఆరోగ్యంతో ఉండాలి. 18-60 ఏళ్ల మధ్య వయస్కులై ఉండాలి. రక్తదాత 45 కేజీలపైబడి బరువుండాలి. సాధారణ స్థాయిలో బీపీ, షుగర్ ఉండాలి, మూడు నెలల వ్యవధిలో ఏడాదికి నాలుగుసార్లు రక్తదానం చేయొచ్చు. రక్తదానం చేయడానికి 12 గంటల ముందు, తరువాత ఆల్కహాల్ తీసుకోకూడదు. రుతుక్రమం, గర్భధారణ నుంచి బిడ్డకు పాలివ్వడం ఆపేంత వరకు రక్తదానం చేయకూడదు.

127 సార్లు రక్తదానం చేసిన వంకాయల జవహర్



విశాఖ పరిధిలోని వన్‌టౌన్ ప్రాంతానికి చెందిన వంకాయల జవహర్ ఇప్పటి వరకు 127 సార్లు రక్తదానం చేసి ఎంతో మంది ప్రాణాలు కాపాడారు. తొలిసారి ఓ కానిస్టేబుల్ భార్య ప్రాణాపాయ స్థితిలో ఉండగా రక్తదానం చేశారు. అప్పటి నుంచి రక్తదానం చేయడమే పనిగా పెట్టుకున్నారు. ఇతరులకు ప్రేరణ కల్పిస్తూ ఇంతవరకు 1,500 మందితో రక్తదానం చేయించారు. పంజాబ్ నేషనల్ బ్యాంకులో ఆఫీసర్‌గా పని చేసి ఉద్యోగ విరమణ పొందారు. అవయవ దానం చేయాలని అర్ధాంగితో కలిసి ఆయన నిర్ణయించుకున్నారు. నేత్రదానానికి ఆయన పిల్లలను ప్రోత్సహించారు. ఇప్పటి వరకు 60కుపైగా అవగాహన శిబిరాలు నిర్వహించి వందల యూనిట్ల రక్తాన్ని సేకరించి అనేక బ్లడ్ బ్యాంకులకు అందించారు. అత్యవసర పరిస్థితుల్లో ఎవరైనా రక్తం కావాలని ఫోన్ చేస్తే సిద్ధంగా ఉండడంతోపాటు మరింత మందిని తీసుకెళ్లి వారి ప్రాణాలను కాపాడడంలో ముందుంటారు.

తల్లుల్లో ఆనందోత్సాహాలు

... 5వ పేజీ తరువాయి

ప్రభుత్వం జమ చేస్తున్నది. ఉదాహరణకు ఇద్దరు పిల్లలు ఉంటే తల్లి బ్యాంకు ఖాతాలో రూ.26 వేలు, ముగ్గురు పిల్లలు ఉంటే రూ.39 వేలు, నలుగురు పిల్లలు ఉంటే రూ.52 వేలు, ఐదుగురు పిల్లలు వుంటే రూ.65 వేలు జమ అవుతున్నాయి. మిగిలిన రూ.2 వేలను పాఠశాలల అభివృద్ధి, నిర్వహణ కోసం జిల్లా కలెక్టర్ ఖాతాలో ప్రభుత్వం జమ చేస్తుంది. కాగా బ్యాంకు ఖాతాలు సక్రమంగా నిర్వహించుకోకపోవడం, ఈకేవైసీ ప్రక్రియ పూర్తి చేయని కారణంగా అర్హుల జాబితాలో పేర్లు వున్నప్పటికీ ఖాతాలో డబ్బులు జమ కావడంలేదు. ఇటువంటి వారు ఈ నెల 20వ తేదీలోగా గ్రామ/వార్డు సచివాలయాల్లో తెలియపరచాలని అధికారులు చెబుతున్నారు. అదే విధంగా ఈ పథకానికి అర్హులై వుండి, జాబితాల్లో పేరు లేని వారు కూడా సచివాలయాల్లో సంప్రదించాలి. జూన్ 30వ తేదీన తుది జాబితా విడుదల చేసి, మిగిలిన అర్హులకు జూలై 5న నగదును బ్యాంకు ఖాతాల్లో జమ చేయనున్నారు.

సీఎం చంద్రబాబు సొంత అన్నలా ఆదుకున్నారు

- కాళ్ల దుర్గ, కైలాసపట్నం, కోటవురట్ల మండలం



పిల్లలతో దుర్గ

కోటవురట్ల, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): అనకాపల్లి జిల్లా కోటవురట్ల మండలం కైలాసపట్నం గ్రామానికి చెందిన కాళ్ల అర్జునరావు, దుర్గ దంపతులకు నలుగురు పిల్లలు. పెద్ద కుమారుడు పాయకరావుపేటలో ఐటీఐ చదువుతున్నాడు. రెండో సంతానం...కుమార్తె గంగోత్రి నర్సీపట్నం గురుకుల రెసిడెన్షియల్ స్కూల్‌లో పదో తరగతి చదువుతుంది. ఆ తరువాత ఇద్దరు కుమారులు, వెంకట్‌మోహన్, అఖిల్. గొలుగొండ రెసిడెన్షియల్ స్కూల్‌లో ఏడో తరగతి, ఆరో తరగతి చదువుతున్నారు. గంగోత్రి, వెంకట్‌మోహన్, అఖిల్‌కు సంబంధించి తల్లికి వందనం పథకం కింద 39 వేలు బ్యాంకు ఖాతాలో జమ అయ్యాయి. ఈ సందర్భంగా దుర్గ మాట్లాడుతూ ఎన్నికల్లో ఇచ్చిన హామీని చంద్రబాబునాయుడు నిలబెట్టుకున్నారని, సొంత అన్నలా ఆదుకుంటున్నారని ఆనందం వ్యక్తం చేసింది.

కైలాసపట్నంలో ముగ్గురికి సాయం



పిల్లలతో కొప్పల లోవరాజు, దేవి

కోటవురట్ల, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కైలాసపట్నం గ్రామానికి చెందిన కొప్పల లోవరాజు, దేవి దంపతులకు ముగ్గురు పిల్లలు. పెద్ద కుమార్తె నాగలక్ష్మి కోటనందూరు మండలం ఇందుకుబెల్లిలో అమ్మమ్మ ఇంటి వద్ద పెరుగుతూ 6వ తరగతి చదుతున్నది. రెండో కుమార్తె పావని 5వ తరగతి మూడో కుమార్తె అపర్ణ 2వ తరగతి కైలాసపట్నంలో చదువుతున్నారు. 'తల్లి వందనం' పథకం కింద రూ.39 వేలు శుక్రవారం బ్యాంకు ఖాతాలో అయినట్టు దేవి 'ఆంధ్రజ్యోతి'కి తెలిపారు.

ఎంతో ఆనందంగా ఉంది



పిల్లలతో శ్రీను, భాను దంపతులు

గొలుగొండ, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చీడిగుమ్మల గ్రామానికి చెందిన మొండెం శ్రీను, భాను దంపతులకు ముగ్గురు పిల్లలు. పెద్ద కుమార్తె జైభవానీ పదో తరగతి, కుమారుడు రాజా 8వ తరగతి, ఇంకో కుమార్తె సత్యశ్రీవల్లి నాలుగో తరగతి చదువుతున్నారు. తల్లికి వందనం పథకం కింద ప్రభుత్వం శుక్రవారం భాను బ్యాంకు ఖాతాలో రూ.39 వేలు జమ చేసింది. సీఎం చంద్రబాబు ఇచ్చిన హామీని నిలబెట్టుకున్నారని ఆనందం వ్యక్తం చేశారు.

త్రిశంకు స్వర్గంలో భాషోపాధ్యాయులు

» వైసీపీ హయాంలో కేడర్ రద్దుతో ఇబ్బందులు

» అప్పటి నుంచి డీఈవో పూల్‌లో కొనసాగింపు

» ఆరేళ్లలో నాలుగుసార్లు బదిలీ

» తాజాగా ఏజెన్సీ మండలాల్లో పోస్టింగ్

» జడ్పీ ప్రాంగణంలో ఆందోళన

విశాఖపట్నం, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): గత వైసీపీ ప్రభుత్వంలో కొందరు అధికారులు అత్యుత్సాహంతో భాషోపాధ్యాయ (లాంగ్వేజ్ పండిట్లు) కేడర్‌ను రద్దు చేయడంతో వారంతా ఆరేళ్ల నుంచి త్రిశంకుస్వర్గంలో ఉండిపోయారు. ప్రస్తుతం మిగులు ఉపాధ్యాయులగా డీఈవో పూల్‌లో ఉన్న వారిని విద్యా శాఖ ఎక్కడ అవసరం ఉంటే అక్కడకు పంపిస్తోంది. ఏదైనా ఒక పాఠశాలలో టీచర్ దీర్ఘకాలిక సెలవుపై లేదా పదోన్నతిపై వెళ్లిపోతే ఆ స్థానంలో తాత్కాలికంగా పనిచేయాలని ఆదేశాలు ఇస్తోంది. 2008లో మెగా డీఎస్సీ ద్వారా తెలుగు, హిందీ, ఒరియా, ఉర్దూ, కన్నడ, తమిళం, సంస్కృత భాషల కోసం ఎంపికైన భాషోపాధ్యాయుల్లో కొందరికి తరువాత గ్రేడ్-1 పండిట్లుగా పదోన్నతి లభించింది. అయితే 2019 నవంబరులో వైసీపీ ప్రభుత్వం జీవో నంబరు 77 ద్వారా భాషోపాధ్యాయ వ్యవస్థను రద్దు చేసింది. దీంతో ఉమ్మడి విశాఖపట్నం జిల్లాలో పదోన్నతి లభించని 66 మంది డీఈవో పూల్‌లోకి వెళ్లిపోయారు. కేడర్ రద్దు చేసినప్పుడు ఆ పోస్టులో ఉన్నవారందరికీ పదోన్నతి కల్పిస్తే భవిష్యత్తులో ఇబ్బందులు ఉండవని తెలిసినా అధికారులు పట్టించుకోలేదు. ఉన్నతాధికారుల అనాలోచిత నిర్ణయాలతో గడచిన ఆరేళ్లలో భాషోపాధ్యాయులు నాలుగు సార్లు బదిలీలకు గురయ్యారు. నిబంధనల మేరకు ఒక టీచర్ ఒకే స్కూలులో ఎనిమిదేళ్లు పనిచేయవచ్చు. దానికి భిన్నంగా పండిట్లను ఎప్పుడు పడితే అప్పుడు బదిలీ చేయడం పరిపాటిగా మారింది. ఇటువంటి పరిస్థితులతో విసుగుచెందిన భాషోపాధ్యాయులు తమకు న్యాయం చేయాలంటూ 2024లో కోర్టును ఆశ్రయించారు. అర్హతల మేరకు మూడు నెలల్లో పదోన్నతులు కల్పించాలని కోర్టు ఆదేశించినా ఖాళీలు లేవని విద్యా శాఖ వాయిదా వేస్తూ వచ్చింది. ఈలోగా సీనియారిటీ మేరకు భాషోపాధ్యాయులుగా తమకు కూడా పదోన్నతులు కల్పించాలని ఎస్జీటీలు కోర్టును ఆశ్రయించారు. దీంతో యథాస్థితి కొనసాగించాలని కోర్టు ఆదేశించింది.

భాషోపాధ్యాయుల ఆందోళన

భాషోపాధ్యాయుల బదిలీల కోసం వెబ్ ఆప్షన్లకు అవకాశం ఇచ్చినా ఎవరూ ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేయలేదు. మరోవైపు ఉమ్మడి జిల్లాలో డీఈవో పూల్‌లో ఉన్న 66 మంది భాషోపాధ్యాయులలో 48 మందిని అల్లూరి సీతారామరాజు జిల్లాలోని గూడెంకొత్తవీధి, పెదబయలు, ముంచంగిపుట్టు, చింతపల్లి మండలాల్లో ఉన్న ప్రాథమిక పాఠశాలల్లో పోస్టింగ్ ఇస్తామని, మిగిలిన 18 మందిని క్లస్టర్ పాఠశాలల్లో సర్దుబాటు చేస్తామని విద్యాశాఖాధికారులు పేర్కొన్నారు. దీనిపై శుక్రవారం జడ్పీ ప్రాంగణంలో టీచర్ల కౌన్సెలింగ్ జరుగుతున్న హాలు ముందు భాషోపాధ్యాయులు ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా పండిట్లు మాట్లాడుతూ 66 మందిలో 50 మంది వరకూ మహిళలే ఉన్నారని, ఏజెన్సీలో మారుమూల ప్రాంతాలకు ఎలా వెళతారని ప్రశ్నించారు. తమను మైదాన ప్రాంతంలో ఏ మూలైనా యూపీ పాఠశాలలకు పంపాలని డిమాండ్ చేశారు. వారి తరపున ఉపాధ్యాయ సంఘ ప్రతినిధులు వెంకటపతిరాజు, గోపినాథ్, తదితరులు విశాఖ ఆర్జేడీ విజయభాస్కర్, విశాఖ డీఈవో ప్రేమ్‌కుమార్, అనకాపల్లి డీఈవో అప్పారావునాయుడుతో చర్చలు జరిపారు. సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లాలని విజ్ఞప్తిచేశారు.

కొనసాగుతున్న టీచర్ల కౌన్సెలింగ్

ఉమ్మడి విశాఖపట్నం జిల్లాలో సెకండరీ గ్రేడ్ టీచర్ల బదిలీల కౌన్సెలింగ్ మూడో రోజు శుక్రవారం కొనసాగింది. సీనియారిటీ జాబితాలో 801 నుంచి 1,600 నంబర్ వరకూ గల వారిని కౌన్సెలింగ్‌కు ఆహ్వానించారు. రాత్రి ఎనిమిది గంటల సమయానికి 1,200 వరకూ పూర్తిచేశారు. నగరానికి ఆనుకుని ఉన్న చినగదిలి, గోపాలపట్నం, గాజువాక, పెదగంట్యాడ, భీమిలి, ఆనందపురం, పద్మనాభం, పెందుర్తి మండలాల్లో ఎస్జీటీ ఖాళీలు పూర్తిగా భర్తీచేశారు. ఇంకా అనకాపల్లి జిల్లా నర్సీపట్నం మండలంలో మొత్తం ఖాళీలు భర్తీ అయ్యాయి. పాఠశాల విద్యా శాఖ ప్రాంతీయ సంచాలకులు విజయభాస్కర్, మూడు జిల్లాల డీఈవోలు ప్రేమ్‌కుమార్, అప్పారావునాయుడు, బ్రహ్మాజీలు కౌన్సెలింగ్‌ను పర్యవేక్షించారు. శనివారం ఉదయం 8.30 గంటల నుంచి సీనియారిటీ జాబితాలో 1,601 నుంచి చివర నంబరు అంటే 2,468 వరకూ గల టీచర్లకు బదిలీలు నిర్వహించనున్నారు. శనివారంతో కౌన్సెలింగ్ పూర్తిచేయాలని నిర్ణయించారు.

న్యాయవాదులకు నైతికత, సమగ్రత అవసరం

» సుప్రీం కోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ లావు నాగేశ్వరరావు



జస్టిస్ లావు నాగేశ్వరరావును సత్కరిస్తున్న వీసీ ప్రొఫెసర్ సూర్యప్రకాశరావు, తదితరులు

సబ్బవరం, జూన్ 13 (ఆంధ్రజ్యోతి) : న్యాయవాద వృత్తిలో రాణించేందుకు న్యాయవాదులకు నైతికతతో పాటు సమగ్రత అవసరమని సుప్రీం కోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ లావు నాగేశ్వరరావు అన్నారు. సబ్బవరంలోని దామోదరం సంజీవయ్య జాతీయ న్యాయ విశ్వవిద్యాలయంలో బార్ కౌన్సిల్ సమావేశం రెండో రోజైన శుక్రవారం కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ న్యాయవాద వృత్తిలో రాణించాలంటే సహనం, కృషి ఎంతో అవసరమన్నారు. ప్రస్తుత పరిస్థితులో మధ్యవర్తిత్వానికి పెరుగుతున్న ప్రాముఖ్యతను వివరించారు. న్యాయవాదులు, న్యాయమూర్తులకు మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా శిక్షణ ఉండాలన్నారు. అనంతరం జస్టిస్ నాగేశ్వరరావును వీసీ ప్రొఫెసర్ సూర్యప్రకాశరావు ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో రాష్ట్ర బార్ కౌన్సిల్ చైర్మన్ నల్లారి ద్వారకానాథ్‌రెడ్డి, రాష్ట్ర బార్ కౌన్సిల్ వైస్ చైర్మన్ సిరపరపు కృష్ణమోహన్, బార్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా మెంబర్(ఏపీ) అల్లూరి రామిరెడ్డి, ఏపీ హైకోర్టు బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కలిగినీడి చిదంబరం, రాష్ట్ర బార్ కౌన్సిల్ విశాఖపట్నం సభ్యులు పి.నరసింగరావు, గంటా రామారావు, కీర్తి రామజోగేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ భూమికి విముక్తి

... 5వ పేజీ తరువాయి

రెవెన్యూ పరిధిలో సుమారు 50 ఎకరాలు అడుగుతున్నట్టు సమాచారం. దీంతో కలెక్టర్ విజయ్‌కృష్ణన్, జేసీ జాహ్నవి, నర్సీపట్నం ఆర్డీవో వి.వి.రమణ, ఏపీఐఐసీ జోనల్ మేనేజర్ నరసింహారావు, తదితర అధికారులు గత నెల రోజుల్లో వేర్వేరుగా ఇక్కడి భూములను పరిశీలించారు. ప్రభుత్వ భూములను సాగు చేసుకుంటున్న సన్న, చిన్నకారు రైతులకు కొంత పరిహారం ఇచ్చి భూములను స్వాధీనం చేసుకోవాలని అధికారులు నిర్ణయించినట్టు తెలిసింది. ఎకరాకు రూ.4-5 లక్షల వరకు పరిహారం చెల్లించే అవకాశం వుందని టీడీపీ నాయకులు చెబుతున్నారు. ఆయా సాగుదారులను ఇప్పటికే గుర్తించారని, నెల రోజుల్లో భూములను స్వాధీనం చేసుకుంటారని స్థానికంగా చెప్పుకుంటున్నారు. రెండు, మూడు రోజుల్లో కలెక్టర్ మరోసారి ఇక్కడకు వచ్చి భూములను పరిశీలిస్తారని రెవెన్యూ వర్గాల్లో ప్రచారం సాగుతున్నది.

ప్రభుత్వ శాఖల్లో బదిలీల సందడి!

... 5వ పేజీ తరువాయి

చేశారు. సచివాలయాల ఉద్యోగుల హేతుబద్ధీకరణ, బదిలీలను ప్రభుత్వం ఒకేసారి చేపట్టనుంది. హేతుబద్ధీకరణ తరువాత మిగులు ఉద్యోగులను ఇతర ప్రభుత్వ శాఖలకు డిప్యుటేషన్లపై పంపనున్నది. జనాభా పరంగా సచివాలయాలను ప్రభుత్వం మూడు కేటగిరీలుగా విభజించింది. 'ఏ' కేటగిరీ సచివాలయంలో ఆరుగురు, 'బి' కేటగిరీ సచివాలయంలో ఏడుగురు, 'సి' కేటగిరీ సచివాలయంలో ఎనిమిదివి మంది ఉద్యోగులు వుంటారు.

చేపల వేటకు వేళాయె!

... 5వ పేజీ తరువాయి

సముద్రంపై చేపల వేట సాగించే మత్స్యకారులు ఉన్నారు. ఈ ఏడాది ఏప్రిల్ 14వ తేదీ అర్ధరాత్రి నుంచి జూన్ 14వ తేదీ అర్ధరాత్రి వరకు సముద్రంలో చేపల వేటపై ప్రభుత్వం నిషేధం విధించిన విషయం తెలిసిందే. గత ఏడాది జిల్లాలో 2,168 మంది మత్స్యకారులు చేపల వేట నిషేధ భృతికి అర్హులుగా మత్స్యశాఖ అధికారులు గుర్తించారు. ఈ ఏడాది 2,400 మందిని అర్హులుగా నిర్ధారించి, ఒక్కొక్కరికి రూ.20 వేల చొప్పున రూ.4.8 కోట్లు ఆయా మత్స్యకారుల బ్యాంకు ఖాతాల్లో రెండు నెలల క్రితమే జమ చేసింది. గత ప్రభుత్వంతో పోలిస్తే కూటమి ప్రభుత్వం రెట్టింపు భృతి ఇవ్వడంతో మత్స్యకారులు ఆనందం వ్యక్తం చేశారు.

క్రైం... crime news

ట్రాన్స్‌ఫార్మర్ల చోరీ కేసులో ముగ్గురి అరెస్టు

» పరారీలో మరో ఇద్దరు

» విశాఖ, అనకాపల్లి జిల్లాల్లో 42 ట్రాన్స్‌ఫార్మర్లను అపహరించారని డీఎస్పీ వెల్లడి



వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ విష్ణుస్వరూప్. వెనుక వరుసలో నిందితులు

సబ్బవరం, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): విశాఖపట్నం, అనకాపల్లి జిల్లాల్లోని పలు మండలాల్లో గత రెండేళ్లుగా ఏపీఈపీడీసీఎల్‌కు చెందిన 42 ట్రాన్స్‌ఫార్మర్లను చోరీ చేసిన కేసుల్లో ముగ్గురు నిందితులను శుక్రవారం సబ్బవరం పోలీసులు అరెస్టు చేశారు. మరో ఇద్దరు పరారీలు ఉన్నారు. దీనికి సంబంధించి పరవాడ డీఎస్పీ వి.విష్ణుస్వరూప్ తెలిపిన వివరాలు ఇలా వున్నాయి. విశాఖపట్నం మర్రిపాలేనికి చెందిన గరికిపాటి సాయికిరణ్, పట్నాల రాజేశ్వరరావు, మహరాణిపేటకు చెందిన నెల్ల సాయిప్రసాద్‌తో పాటు మరో ఇద్దరు 2023 నవంబరు నుంచి 2025 జూన్ వరకూ ఉమ్మడి విశాఖపట్నం జిల్లాలోని సబ్బవరం, ఆనందపురం, పెందుర్తి, అచ్యుతాపురం, చోడవరం, కశింకోట, యలమంచిలి, భీమిలి మండలాల్లో ఏపీఈపీడీసీఎల్‌కు చెందిన ట్రాన్స్‌ఫార్మర్లను చోరీ చేశారు. అప్పటి నుంచి ఆయా పోలీసు స్టేషన్లలో కేసులు నమోదవుతున్నాయి. 8 మండలాల్లో 42 ట్రాన్స్‌ఫార్మర్లను చోరీ చేయగా, ఇందులో అత్యధికంగా సబ్బవరం మండలంలో 15 ట్రాన్స్‌ఫార్మర్లు ఉన్నాయని డీఎస్పీ తెలిపారు. నిందితులు ట్రాన్స్‌ఫార్మర్లలో ఉండే కాపర్ వైర్‌ను తీసి అమ్మేసేవారన్నారు. ఈ విధంగా 190 కిలోల కాపర్ తీగను అమ్మేశారన్నారు. దీనిని రికవరీ చేశామని ఆయన తెలిపారు. ఈ కేసుల్లో మరో ఇద్దరు పరారీలో ఉన్నారని, వారిని త్వరలోనే అరెస్టు చేస్తామని చెప్పారు. నిందితులను పట్టుకోవడంలో చొరవ చూపిన సీఐ జి.రామచంద్రరావు, ఎస్ఐలు పి. సింహాచలం, దివ్య, సిబ్బందిని డీఎస్పీ అభినందించారు.

సాయి శ్రేయాస్ ఫార్మాపై కేసు నమోదు

పరవాడ, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): ఫార్మాసిటీలోని సాయి శ్రేయాస్ ఫార్మా స్యూటికల్ ప్రైవేట్ లిమిటెడ్ పరిశ్రమ యాజమాన్యంపై కేసు నమోదు చేసినట్టు పరవాడ సీఐ ఆర్.మల్లికార్జునరావు తెలిపారు. పరిశ్రమలో బుధవారం అర్ధరాత్రి విషవాయువులు పీల్చడంతో ఇద్దరు ఉద్యోగులు మృతి చెందగా, మరొకరు తీవ్ర అస్వస్థతకు గురై ఆస్పత్రి పాలైన సంగతి తెలిసిందే. యాజమాన్యం నిర్లక్ష్యంగా వ్యవహరించడం వలనే ప్రమాదం జరిగినట్టు పీసీబీ అధికారులు తేల్చారు. దీనిని తీవ్రంగా పరిగణించి వివిధ సెక్షన్ల కింద కేసు నమోదు చేసినట్టు సీఐ తెలిపారు. నిర్లక్ష్యం, మానవ ప్రాణాలకు హాని కలిగించడం తదితర అభియోగాలపై కేసు నమోదు చేశారు. కాగా అస్వస్థతకు గురై ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న హెల్పర్ భైడా బన్సాల్ ఆరోగ్యం కాస్త మెరుగుపడిందని సీఐ వెల్లడించారు.

క్షణికావేశంలో దారుణం

» భార్యను డంబెల్‌తో కొట్టి హతమార్చి, అనంతరం తానూ ఆత్మహత్య

» అనాథలుగా ఇద్దరు పిల్లలు

» రెడ్డికంచరపాలెంలో ఘటన

విశాఖపట్నం, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ 54వ వార్డు పరిధిలోని రెడ్డి కంచరపాలెంలో శుక్రవారం తెల్లవారుజామున దారుణం చోటుచేసుకుంది. భార్యపై అనుమానంతో పాటు తనపై పోలీసులకు ఫిర్యాదు చేసిందనే కోపంతో డంబెల్‌తో దాడి చేసి హతమార్చిన భర్త...అనంతరం తాను కూడా ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. దీంతో వారి ఇద్దరు పిల్లలు అనాథలుగా మిగిలారు. ఈ ఘటనకు సంబంధించి పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. రెడ్డికంచరపాలెం వివేకానంద వీధిలో నివాస ఉంటున్న నందిగామ గోపీనాథ్ (42) పెయింటింగ్ పనులు చేసేవాడు. అతనికి భార్య వెంకటలక్ష్మి (37), కుమారుడు జశ్వంత్ రీతు (14), కుమార్తె లక్ష్మీప్రియ (10) ఉన్నారు. కొంతకాలంగా భార్యాభర్తల మధ్య గొడవలు జరుగుతున్నాయి. ఈ నేపథ్యంలోనే భర్త వేధింపులు భరించలేక వెంకటలక్ష్మి కుమార్తెతో కలిసి పుట్టింటికి వెళ్లిపోయింది. ఇటీవల తిరిగి భర్త వద్దకు వచ్చింది. అయితే వచ్చినప్పటి నుంచి భార్యను గోపీనాథ్ అనుమానంతో వేధిస్తుండేవాడు. ఆ వేధింపులు తట్టుకోలేక వెంకటలక్ష్మి ఈమధ్య కంచరపాలెం పోలీసులకు ఫిర్యాదు చేసింది. తనపై ఇచ్చిన ఫిర్యాదును వెనక్కి తీసుకోవాలని గోపీనాథ్ ఒత్తిడి తెచ్చేవాడు. ఈ క్రమంలోనే శుక్రవారం తెల్లవారుజామున ఇద్దరి మధ్య గొడవ జరిగింది. ఆ సమయంలో ఆవేశంతో ఊగిపోతూ ఇంట్లో ఉన్న డంబెల్‌తో కొట్టి వెంకటలక్ష్మిని గోపీనాథ్ హతమార్చాడు. ఆ తరువాత తాను వేరొక గదిలోకి వెళ్లి గడియ పెట్టి ఫ్యాన్‌కు చీరతో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. తల్లిదండ్రుల మధ్య గొడవ సమయంలో అడ్డుకోవడానికి ఇద్దరు పిల్లలు యత్నించగా వారిని గోపీనాథ్ వేరొక గదిలో పెట్టి తలుపులు వేసినట్టు చెబుతున్నారు. విషయం తెలుసుకున్న కంచరపాలెం పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం కేజీహెచ్‌కు తరలించారు. భర్త వేధింపులపై వెంకటలక్ష్మి కంచరపాలెం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసిందని, గోపీనాథ్‌పై చర్యలు తీసుకుని ఉంటే ఈ రోజు ఈ పరిస్థితి వచ్చేది కాదని మృతుల కుటుంబ సభ్యులు వాపోయారు.

అనుమానాలు అనేకం

... 5వ పేజీ తరువాయి

అనుమానాలు ఉన్నాయని, విచారణ చేయించాలని డిమాండ్ చేశారు.

ఘటన నేపథ్యంపై గోప్యత

సాయి శ్రేయాస్‌లో విషవాయువులు అని అధికారులు చెబుతున్నారే తప్ప అది ఏమిటనేది సాంకేతికంగా బయటకు చెప్పడం లేదు. ఒక అధికారి అక్కడ హైడ్రోజన్ సల్ఫైడ్ (హెచ్2ఎస్) విడుదలైందని చెబుతుంటే...దానిని ప్రజాశాస్త్రవేత్తల బృందం ఖండిస్తోంది. ఏ రకమైన రసాయనాలు అక్కడ ఉన్నాయో చెప్పకుండా హెచ్2ఎస్ అని ఎలా నిర్ధారిస్తారని ప్రశ్నిస్తోంది. ఈ ప్రమాద ఘటన క్రమం ఏమిటి?, ఏ రసాయనాల వల్ల జరిగిందనేది కాలుష్య నియంత్రణ మండలి అధికారులు, ఫ్యాక్టరీస్ విభాగం పెద్దలు చెప్పడం లేదు. అసలు ఫ్యాక్టరీస్ విభాగం అక్కడ ఏ రకమైన తనిఖీలు చేసిందో కూడా వెల్లడించడం లేదు. ఆ శాఖ అధికారులు కార్యాలయంలో ఉండడం లేదు. ఫోన్లకు స్పందించడం లేదు. నష్టపరిహారం ఇచ్చేశారు కాబట్టి కేసును క్లోజ్ చేయాలని అంతా కలసి ప్రయత్నిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఎఫ్లూయెంట్ ట్రీట్‌మెంట్ ప్లాంటు, దాని నిర్వహణపై కూడా అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. దీనిపై పూర్తిస్థాయి విచారణ చేపట్టాల్సి ఉంది.

కత్తితో భార్యపై దాడి

... 5వ పేజీ తరువాయి

కొంత కాలం క్రితం వీరి మధ్య కలహాలు మొదలయ్యాయి. పెద్దలు సర్దిచెప్పినప్పటికీ కొద్ది రోజుల తరువాత మళ్లీ గొడవ పడుతున్నారు. ఈ నేపథ్యంలో గురువారం రాత్రి మరోసారి గొడవ జరిగింది. తరువాత దేవి ఇంటిలో నిద్రపోగా, రాము వరండాలో పడుకున్నాడు. శుక్రవారం తెల్లవారుజామున రాము కత్తితో భార్యపై విచణారహితంగా దాడి చేశాడు. శరీరంపై పలుచోట్ల కత్తితో పొడిచాడు. ఎడమ చేతి వేళ్లు తెగిపోయాయి. దీంతో ఆమె ఈ విషయాన్ని ఆమె సోదరుడు కృష్ణకు ఫోన్ చేసి చెప్పడంతో వెంటనే వచ్చాడు. రక్తపు మడుగులో ఉన్న దేవిని 108లో కె.కోటపాడు సీహెచ్‌సీకి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం విశాఖ కేజీహెచ్‌కు తరలించారు. బాధితురాలి సోదరుడు కృష్ణ ఇచ్చిన ఫిర్యాదుపై కేసు నమోదు చేసినట్టు ఎస్.ఐ మల్లీశ్వరరావు తెలిపారు.

చికెన్ ధరలు	
బ్యాగ్	రూ.లలో
రైతు ధర	87.00
లైవ్ ధర	107.00
విత్ స్కిన్	184.00
స్కిన్ లెస్	194.00

కోడి గుడ్లు (నెక్)	
వంద గుడ్లు	రూ.లలో
విశాఖపట్నం	550
విజయనగరం	554
శ్రీకాకుళం	554
